ఆదివారం

# వార్త

17 డిసెంబరు, 2023



# సు'గంధా'న్ని హరిస్తున్న విష 'పుష్పా'లు



# త్వరలో కమల్-మణిరత్నం సినిమా!

కమల్‌హాసన్ హీరోగా లెజెండరీ దర్శకుడు మణిరత్నం చాన్నాళ్లకి 'థగ్ లైఫ్' అనే సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రం సహ నిర్మాతలలో కమల్ ఒకరు. ఇందులో హీరోయిన్‌గా మొదట్లో త్రిష, నయనతార పేర్లు వినిపించాయి. ప్రస్తుతం మంజు వారియర్ పేరు వినిపిస్తోంది. ఆ మధ్య ఐశ్వర్యరాయ్ కథానాయికగా నటించనుందని వినిపించింది. చివరకు మంజు వారియర్‌ను ఫైనల్ చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత కమల్-మణిరత్నం కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది. ఈ సినిమా ఏ రేంజ్‌లో హిట్ అవుతుందో చూడాలి మరి.

## తారాతీరం



# 'నా సామిరంగ'లో ఆశికా రంగనాథ్?

టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున ప్రధాన పాత్రలో నటించిన తాజా సినిమా 'నా సామిరంగ'. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఎమ్.ఎమ్. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తు న్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే కథ. 'అమిగోస్' సినిమాతో ఆశికా రంగనాథ్ ఎంట్రీ ఇచ్చింది.

ఆదివారం వార్త

17 డిసెంబరు, 2023

## మంచి ముత్యాలు

సంపదలుగాని, పేరు ప్రతిష్టలుగాని, గౌరవ మర్యాదలుగాని, పాండిత్యంగాని పనిచేయవు. ప్రేమ ఒక్కటే నిలిచి ఉంటుంది.

స్వామి వివేకానంద

## విషయ విశేషం

ఆల్చిప్పలతో మనసైన చిత్రాలు.. 4

'సంఘీ'భావం....5

ఉద్యోగ నియామకాలు సజావుగా సాగేనా?

కవర్ స్టోరీ..6

సు'గంధా'న్ని వారిస్తున్న విష'పుష్ప'లు

ఓ ఆదర్శ ఆఫీసర్...11

ఈవారం కవిత్వం..12

పొయ్యిరాళ్లు

ధనుర్మాసం ప్రత్యేకత....18

కథ.. 20

ఎవరో వస్తారని..

సాహిత్యం..23

'విశ్వంభర' మానవ మహాప్రస్థానం

అమెరికాలో వింత స్మారక చిహ్నాలు...25

నిర్ణయం...29

ఇంకా..

పుస్తక సమీక్ష


మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### వైరస్‌లతో పెనుముప్పు!



వైరస్ ఎంత ప్రమాదకరమైనదో అది అన్నింటినీ తట్టుకుని ఎంతవేగంగా పరిణామం చెందుతుందో గత నాలుగేళ్ల నుంచీ చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా కొవిడ్-19 ప్రపంచవ్యాప్తంగా ఎంతటి సంక్షోభానికి కారణమైందో అనుభవంలోకి వచ్చింది. దాంతో శాస్త్ర ప్రపంచం వైరస్‌లమీద ప్రత్యేక దృష్టిని సారించింది. అందులోభాగంగా అమెరికా బయోటెక్నాలజీ సంస్థ జింకో బయోఎవర్క్స్‌కు చెందిన నిపుణులు చేసిన ఓ అధ్యయనం మానవాళిని కలవరానికి గురిచేస్తుంది. ఈ విషయమై వీళ్లు గత అరవయ్యేళ్ల డేటాను సేకరించి, మొత్తంగా 3150 వైరల్ అంటువ్యాధుల వ్యాప్తినీ వాటి కారణంగా సంభవిస్తున్న మరణాలనూ విశ్లేషించగా అవి ఏటికేడాదీ పెరుగుతున్నట్లు గుర్తించారు. గబ్బిలాల నుంచి నిఫా, ఎబొలా, సార్స్ వైరస్‌లు మనిషికి సంక్రమిస్తున్నాయి. అలాగే కెలామస్ అనే ఒక రకం ఎలుక జాతి జంతువు నుంచి సంక్రమించే మాచుపో వైరస్ బ్రెయిన్ హెమరేజ్‌తో మరణించేలా చేస్తుంది. మంకీపాక్స్, ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా..ఇలా మరెన్నో వైరస్‌లూ బ్యాక్టీరియాలూ జంతువుల నుంచి ఆహారం, నీరు, వాతావరణం ద్వారా మనుషులకు సంక్రమిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం పేర్కొంటోంది. ఇవి కేవలం ఆరోగ్యాన్నే కాదు, ఆర్థిక, రాజకీయ స్థిరత్వాన్నీ దెబ్బతీస్తున్నాయి. ఇదిలాగే కొనసాగితే 2050నాటికి వైరస్ కారణంగా మరణాల సంఖ్య ప్రస్తుతం ఉన్నదానికన్నా పన్నెండు రెట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

### జోక్స్..జోక్స్

భార్య: ఏమండీ! నేను బజారుకెళ్తున్నాను. మీకూ ఏమైనా కావాలంటే చెప్పండి, ఎలాగో బస్సు ఫ్రీ కదా, మళ్లీ మీకు పెట్రోల్ ఖర్చు దండగ.

భర్త: వద్దు..వద్దు.. నే తెచ్చుకుంటాలే..

భార్య: అదేం కుదరదు, ఇక నుంచి మీకేమీ కావాలో నేనే తెస్తా, ఇంతకాలం మీరు తిరిగారు, ఇకనుంచి నేను తిరుగుతాను.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# ఆల్చిప్పలతో మనసైన చిత్రాలు



ఏ సముద్రం ఒడ్డునో లేదా కాకులు తెచ్చి పారేస్తే పెరట్లోనో ఆల్చిప్పలు మనకు కనిపిస్తే ఏం చేస్తాం.. మామిడి కాయల తొక్కనో పాలమడ్డినో గీరడానికి వాడి పారేస్తాం. కానీ అవే ఏ కళాకారుల చేతిలోనో పడితే మాత్రం ఇంత అద్భుతమైన చిత్రాలుగా మారిపోతాయి. అవునండీ ..ఇవన్నీ ఆల్చిప్పలతో చేసిన పెయింటింగులే మరి. అదెలా సాధ్యం అంటారా..సముద్రాల్లో నదుల్లో పెరిగే నత్త జాతికి చెందిన జీవులే ఆల్చిప్పలు. వాటిలోపల కాల్షియం కార్బొరేట్ పొరలుపొరలుగా చేరుకోవడంతో అది నున్నగా మారి కాంతి పడినప్పుడల్లా రంగురంగుల్లో మెరుస్తుంటుంది. ఆ పొరల్నే 'మదర్ ఆఫ్ పెరల్' అంటారు. మెరిసే ఆ పొరల్ని ఆల్చిప్పల నుంచి ఎంతో జాగ్రత్తగా వేరుచేసి, మందపాటి నల్లని బట్ట లేదా చెక్క మీద అతికిస్తూ ఇలా అందమైన చిత్రాలకు రూపుదిద్దుతున్నారు కొందరు కళాకారులు.









# 'సంఘీ' భావం



## ఉద్యోగ నియామకాలు సజావుగా సాగేనా?

తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్లక్ష్య వైఖరితో వరుసగా లీకేజీలతో ప్రతిష్టాత్మకమైన పరీక్షలు రద్దు కావడంతో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంతో ఉంది. దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు అందడం లేదన్న విమర్శలు వినవస్తున్నా తెలంగాణలో మాత్రం నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగనియామకాలు సజావుగా సాగకపోవడం శాపంగా పరిణమించింది. గ్రూప్‌ఒన్ పరీక్షలు రెండుసార్లు రద్దు అయినా అప్పటి ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన కనిపించలేదు. చాలా సున్నితమైన సమస్యను నిర్ల క్ష్యం చేయడంతో టిఎస్‌పిఎస్‌సి నిర్వహించే పరీక్షలపై విశ్వాసం సన్నగిల్లింది. ఏదైనా శాఖలో లోపాలు జరిగితే వెంటనే ఆయా శాఖ ఉన్నతాధికారులపై చర్యలు ఉంటాయి. విచిత్రం ఏమి టంటే సుమారు అరడజను పరీక్షలు లీకేజీకి గురై రద్దు అయినా సర్వీసు కమీషన్ అధికారులపై చర్యలు తీసుకోలేని దుస్థితి కొనసాగింది. ఈ సంవత్సరం ప్రారంభంలోనే గత ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలకు రంగం సిద్ధం చేసింది. ఐదేళ్ల ఉద్యోగాల నోటిఫికేషన్ ఎదురుచూసిన నిరుద్యోగులు ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెట్టుకున్నారు. అనుకున్న విధంగానే అనేక ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఇందులో రాష్ట్రంలోనే అత్యున్నత ఉద్యోగాలుగా భావించే గ్రూప్ ఒన్ పరీక్షల నోటిఫికేషన్ వెలువడటం అర్హులైన నిరుద్యోగుల్లో ఆనందం కలిగించింది. పరీక్షల్లో అర్హత సాధించేందుకు గ్రామాలను వదిలి, అప్పులు చేసి హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నిరుద్యోగులు ఇక్కడి కోచింగ్ సెంటర్లలో చేరారు. రేయింబవళ్లు కష్టించి ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించి తమ తల్లిదండ్రులను ఆనందపరచడంతో పాటు తామ జీవితాల్లో స్థిరత్వాన్ని పొందాలని ఆశపడ్డారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్న వారు కూడా తమ పిల్లలు ప్రభుత్వ ఉన్నతాధికారులుగా నియమితులైతే అంతే చాలని ఆర్థిక స్థోమత లేకపోయినా ఇంట్లో బంగారం, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ పంపించారు. అయితే ప్రభుత్వం జారీ చేసిన ఏ ఒక్క నోటిఫికేషన్ కూడా నిరుద్యోగుల ఆశలు ఫలించే అవకాశం లేకుండా పోయింది. పబ్లిక్ సర్వీసు కమీషన్‌లో ఉన్నతాధికా రులు తమ కార్యాలయం నుంచి పేపరు లీకేజీలు జరుగుతుంటే పట్టించు కోలేదు. అప్పటి ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న కొందరు నేతల ఆదేశాల మేరకు ఉన్నతాధికారులే పేపరు లీకేజీకి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. పోలీసులు రంగంలో దిగి కింది స్థాయి సిబ్బందిని, అదికూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కొందరిని మాత్రమే బాధ్యులు చేస్తూ దర్యాప్తును పరిమితం చేశారు. పరీక్షలు రాసిన కొందరు అభ్యర్థులపై మాత్రం పెద్ద సంఖ్యలో కేసులు పెట్టారు. నిరుద్యోగులు పబ్లిక్ సర్వీసు కమీషన్ కార్యాలయం ముందు ధర్నాలు, ఉద్యమాలు నిర్వహించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను కొమ్ము కాసిన గత ప్రభుత్వ నేతలు ఉద్యోగం రాలేదన్న బాధతో ఉద్యమం చేసిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపించింది. మొదటి సారి పేపర్ లీకేజీ సమయంలో ఉన్న అధికారులతోనే మళ్లీ గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించింది. చేతివాటానికి అలవాటు పడ్డ సదరు అధికారులు రెండోసారి కూడా తమ వైఖరి మార్చుకోకుండా వ్యవహరించారు. దీనితో రెండోసారి నిర్వహించిన పరీక్షలు కూడా రద్దు అయ్యాయి. వీటితో అనేక పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీకి గురైనట్లు వెల్లడి కావడంతో వాటన్నింటినీ రద్దు చేశారు. పరీక్షల నిర్వహణపై శ్రద్ధ చూపని అధికారులను నియమించడం, తమ వారికి ఉద్యోగాలు కల్పించేందుకు వారితో పేపర్ లీకేజీలకు ప్రభుత్వ పెద్దలు సహకరించడంతో పరీక్షల నిర్వహణ తెలంగాణలో ఒక ప్రహసనంగా మారింది. ఈ తరుణంలో ఎన్నికలు వచ్చాయి. నిరుద్యోగుల తమ ఆవేదనను ఓట్ల రూపంలో వెల్లగక్కారు. దీనితో పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన సర్కారుకు నూకలు చెల్లాయి. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. దీనితో తమకు ప్రభుత్వ కొలువులు ఈసారి తప్పకుండా దక్కుతాయని నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. జనవరి నుంచి మళ్లీ పరీక్షలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో ఎలాంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది. హైదరాబాద్‌లో యువ సంఘర్షణ సభ నిర్వహించే సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ హాజరై యూత్ డిక్లరేషన్‌ను ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీని జూన్ రెండవ తేదీ నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సెప్టెంబరు 17 లోపు నియామకాలు పూర్తి చేసి, సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేస్తామని, ప్రతి జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది గ్రాడ్యుయేషన్ అంతకంటే ఎక్కువ విద్యార్హతలు పొందిన యువకులు ఉన్నారు. మరోపక్క ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం గత ఐదారేళ్లుగా చేపట్టలేదు. దీనితో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేష్ల మేరకు ఉద్యోగ నియామకాలు పూర్తి చేసి ఉంటే నిరుద్యోగుల్లో కొంతైనా నమ్మకం కలిగేది. అరడజనకు పైగా పరీక్షల్లో లీకేజీలు వెలుగు చూడటం, ఆ పరీక్షలు రద్దు కావడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను నిరుద్యోగ యువతను ఆకర్షించింది. ప్రస్తుతం నూతనంగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నియామకాలు చేస్తారని యువత ఆశగా ఎదురుచూస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

**ఎర్రచందనం వృక్షానికి 'టెరో కార్పస్ సాంటలైనస్' అనే శాస్త్రీయ నామం ఉంది. టెరో అంటే గ్రీకు భాషలో కర్ర అని అర్థం. దీనినే రక్తచందనం, శాంటాలం, ఎర్రబంగారం అని కూడా పిలుస్తారు. బంగారం కంటే విలువైనది కనుక దీనిని ఎర్రబంగారం అని పిలుస్తారు.**



ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఈ ఎర్రచందనం చెట్లు తూర్పు కనుమలు విస్తరించి దక్షిణ ప్రాంతంలో ఏపీలోని రాయలసీమ జిల్లాలో విస్తరించాయి. శేషాచలం పరిసరాలలో ఓవైపు తిరుమలేశుని దివ్యక్షేత్రం మరోవైపు పచ్చనివనంతో అలరారుతున్న ఆహ్లాదకర వాతావరణం. అందులోనూ ఎన్నో ఔషధ గుణాలు ఉన్న వృక్షాలు కొలువై ఉన్న ప్రాంతం. తిరుమల గిరులుగా

# సు'గంధా'న్ని వారిస్తున్న విష 'పుష్ప'లు

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

పేరొందిన ఈ శేషాచలవనంలో ఎర్రచందనమే కాదు జీవ వైవిధ్యంలో కూడా ప్రత్యేకతను సంతరించుకుంది. నల్లమల, ఎర్రమల, లంకమల ఇలా కర్నూలు నుండి నెల్లూరు వరకు విస్తరించి ఉన్న ఈ పర్వతశ్రేణి మొత్తంలో 16 లక్షల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం ఉంది. ఈ మొత్తం అడవిలో ఉమ్మడి వైఎస్సార్, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లోని శేషాచలం, వెలిగొండ, లంకమల, పాలకొండ ప్రాంతంలోని 5.30 లక్షల హెక్టార్లలో అనేక ఎర్రచందనం వృక్షాలున్నాయి. సుమారు 5,300 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎర్రచందనం చెట్లు ఉన్నట్లు అటవీశాఖ లెక్కలు చెబుతున్నాయి. అత్యధికంగా ఉమ్మడి వైఎస్సార్ జల్లాలో 3,063 చదరపు కిలోమీటర్లలో, నెల్లూరు జిల్లాలో 671,17, చిత్తూరు జిల్లాలో 1,090, ప్రకాశం జిల్లాలో 263, కర్నూలు జిల్లాలో 212 చదరపు కిలోమీటర్ల విస్తార్ణంలో ఉన్నాయి. శేషాచలం అటవీ ప్రాంతం మొత్తంలో 178 కుటుంబాలకు చెందిన 1700 రకాల వృక్షజాతులలో ఉండగా అందులో అత్యంత అరుదైన వృక్షం ఎర్రచందనం. ప్రపంచంలోనే మరెక్కడా కానరాని ఈ అమూల్యమైన ఎర్రచందనం రాయలసీమ కు ఓ తలమానికంగా చెప్పవచ్చు. అత్యంత విలువైన ఈ సంపద ఇక్కడ నెలకొని ఉండటం తిరుమలేశుడి వరంగా భావిస్తారు. ఆయన ఈ ప్రాంతంలో కొలువై ఉండబట్టే ఈ ప్రాంతానికి ఇంత విలువైన సంపద నెలకొందని ఈ ప్రాంత వాసుల నమ్మకం. ఈ భూమండలంలో మరెక్కడా పెరగని అత్యంత విలువైన సంపదగా భావించే ఈ ఎర్రచందనం కేవలం రాయలసీమకే పరిమితమయ్యింది.

## ఇక్కడే ఎందుకు పెరుగుతాయి?

ప్రపంచంలో ఎక్కడా పెరిగే అవకాశం లేని ఈ ఎర్రచందనం చెట్లకి చక్కగా సరిపోతుంది. ఈ రకమైన సమ్మేళం ప్రపంచంలో మరెక్కడా ఉండదనీ, దీనికి ఇక్కడి నేలతోపాటు వాతావరణమూ కూడా కారణమని వృక్షశాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరో మాటలో చెప్పాలంటే ఈ ప్రాంతంలో 'ఎడాఫిక్ పరిస్థితులు'. కలిగి ఉండటం ఎర్రచందనం ఎదుగుదలకు పూర్తి అనుకూలంగా మారింది. ఈ కారణాలవల్లే శేషాచలం ఒక్కచోటే నాణ్యత గల ఈ చెట్లు పెరుగుతున్నాయి. వేరే ప్రాంతాలలో ఎర్రచందనం చెట్లు పెంచడానికి ప్రయత్నాలు చేసిన కూడా ఈ తరహా నాణ్యత ఏ మాత్రం లభించడం లేదు. రైతులు తమ భూములలో వీటిని పెంచుతూ ఉన్నప్పటికీ అవి శేషాచలంలో లభించే కలప నాణ్యతకు ఏ మాత్రం సరితూగదని నిరూపితమయ్యింది.

టిష్యు కల్చర్ పద్ధతి ద్వారా ఏదోవిధంగా వీటిని చైనా, జపాన్‌ల లో పెంచుదామని ఎన్నో ప్రయత్నాలు చేసినా ఏవిధంగానూ సఫలీకృతం కాలేదు. ఈ వృక్షాలు 5--15- సెంటీమీటర్ల వ్యాసంతో 8మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. వీటి ఎదుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. నాణ్యత గల ఎర్రచందనం లభ్యం కావాలి. అంటే 30 నుండి 50 సంవత్సరాలు పైబడి వయసు గల వృక్షం ద్వారానే లభిస్తుంది. అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్ లోనే శేషాచలం కొండల్లో నెలకొన్న ఈ ఎర్రచందనానికి ఎందుకు ఇంత ప్రాధాన్యత నెలకొంది అని పరిశీలిస్తే...

### ప్రత్యేకతలు

మనదేశంలో అందునా ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలో పరిమితమైన ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్దగా గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదనే చెప్పొచ్చు.

కానీ చైనా, జపాన్, మయన్మార్ వంటి తూర్పు ఆసియా దేశాల్లో మాత్రం ఊహించని రీతిలో డిమాండ్ నెలకొంది. జపాన్, చైనా దేశాలలో అయితే వాయిద్య పరికరాలు ఫర్నీచర్ తయారీకి దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. జపనీయుల షామిసేన్, వయొలిన్..వంటి వాటిని ఈ చెక్కతో తయారుచేస్తే వాటి వాయిద్యం అత్యంత వినసొంపుగా ఉండటమే కాకుండా దానిని వినడం వలన శుభం జరుగుతుందని వారి ప్రగాఢ నమ్మకం. రష్యా దేశీయులు కూడా ఈ కలప ద్వారా చేసే ఫర్నీచర్ పట్ల ఎక్కువ మక్కువ చూపుతారు. చైనీయులు చందనంతో తయారు కాబడిన వస్తువులు, బొమ్మలు ఇంట్లో ఉండటాన్ని అదృష్టంగా భావిస్తారు. దీనితో తయారు కాబడ్డ వస్తువులు కలిగి ఉండటం వ్యక్తిగత ప్రతిష్ఠగా భావిస్తారు. చైనాలో రాజరికం ఉన్నప్పటి నుండి రాజవంశీయులు భారత్ నుండి ఈ ఎర్రచందనం తీసుకువెళ్లే వారని చరిత్ర చెబుతోంది. అందుకే దీని కొనుగోలుకు ఎంత ఖర్చైనా ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వెనుకాడేవారు కాదు. ఆ అన్వేషణలో వాళ్ల దృష్టి భారతదేశంలోకి తూర్పు కనుమల్లో ఉన్న శేషాచలం కొండల్లో దొరికే ఎర్రచందనం మీద పడింది. అలా కొన్ని వందల, వేల సంవత్సరాల నుంచీ మన ఎర్రచందనం చైనాకి చేరుకుని అక్కడి కోటల్లో అందంగా కొలువుదీరింది. క్రీ.శ.ఏడో శతాబ్దంలో బౌద్ధ యాత్రికుడు-హుయాన్‌త్సాంగ్ మనదేశాన్ని సందర్శించేటప్పటికే ఎర్రచందనం ఆ దేశానికి అక్రమంగా తరలుతున్నట్లు తెలుస్తోంది. చైనాలో ఎర్రచందనం లభించకపోయినా చైనాలో ప్రత్యేకంగా మనదేశం నుండి తరలింపబడిన ఎర్రచందనంతో తయారు చేయబడిన అద్భుతమైన కళాకృతులు ఉన్నాయి. ప్రత్యేకించి వాటిని ప్రదర్శించే ఓ మ్యూజియం కూడా ఉంది. హన్, మింగ్, క్వింగ్ వంశీకుల రాజప్రసాదాలలో మన ఎర్రచందనంచే తయారు కాబడిన లక్షల కోట్ల సంపద అలంకరింపబడి ఉంది. మన చెంతనే ప్రపంచంలో అద్భుతమైన ఓ సంపద ఉందని చాలాకాలం వరకు మనకే తెలియదు. నాలుగేళ్ల క్రితం చైనాలో జరిగిన ఓ వేలంలో ఎర్రచందనంచే తయారు కాబడి గృహాలంకరణలో భాగంగా వాడే ఫోల్డింగ్ స్క్రీన్ అక్షరాలా 170 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయింది. 1755లో క్వీలాంగ్ ప్రాంతాన్ని పాలించే రాజు యుద్ధంలో గెలిచినందుకు కానుకగా అందుకున్న రూయీ అనే అతిచిన్న కళారూపం సైతం రెండేళ్లక్రితం జరిగిన వేలంపాటలో సుమారు 5 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయింది. అంతేకాదు చైనాలో ఈ-కలపతో వివిధ వాయిద్య పరికరాలు, ఫర్నీచర్ తయారు చేసేగొప్ప కళాకారులు కూడా ఉన్నారు. వీటి తయారీలో శిక్షణ ఇచ్చే శిక్షణా కేంద్రాలు కూడా చైనాలో అనేకం ఉన్నాయి. దీనిని బట్టి ఎర్రచందనంతో చేసిన వస్తువులంటే చైనీయులకి ఎంత క్రేజో తెలుస్తుంది. కాలక్రమంలో ఎర్రచందనం పట్ల చైనీయుల, జపనీయుల మక్కువను చూసి పాశ్చాత్యులు కూడా ఈ ఎర్రబంగారంపై మనసు పారేసుకోవడం మొదలెట్టారు. ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదని ప్రచారం కూడా ఎక్కువగా జరిగింది. అయితే అది వాస్తవం కాదని శాస్త్రజ్ఞులు ఖండించారు. అంతేకాదు దీనిని న్యూక్లియర్ రియాక్టర్‌లలో కూడా వాడతారని, దీనిలో యురేనియం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే దీనికి శాస్త్రీయ నిరూపణ అయితే ఏదీ లేదనే చెప్పవచ్చు.



### ఎర్రచందనంలో

కళాకృతులే కాదు ఔషధగుణాలు కూడా మెండుగా ఉన్నాయి. ఈ కలప నుంచి తీసిన తైలాన్ని సౌందర్య లేపనాలు, ముఖానికి సంబంధించిన క్రీముల తయారీలో వాడతారు. సెక్స్‌పిల్ వయాగ్రాలాగా దీని పొడిని వాడతారు. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రపిండాల సమస్యలు, అల్సర్ వంటి కొన్ని రకాల వ్యాధుల నివారణలో, కొన్ని రకాల గాయాల నివారణలో కూడా ఈ ఎర్రచందనాన్ని వాడతారు. కొన్ని రకాల రంగుల పరిశ్రమల్లో కూడా దీనిని ఉపయోగిస్తారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రకారం-తలనొప్పి, చర్మవ్యాధులు, జ్వరం, కంటి సమస్యలతోపాటు తేలు విషానికి విరుగుడుగానూ దీన్ని ఉపయోగిస్తారు. జీర్ణ సంబంధమైన సమస్యలూ, దగ్గు జలుబూ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లూ, కేన్సర్ల నివారణలోనూ దీన్ని వాడుతారని వైద్యనిపుణులు చెబుతున్నారు.

### డిమాండ్

పలు రూపాలలో ఉపయోగించే ఎర్రచందనం కేవలం ప్రపంచంలోనే శేషాచలం అడవులలోనే లభించడం కారణంగా దీని డిమాండ్ బాగా పెరిగిపోయింది. ఎందుకంటే ఎర్రచందనం చెట్లు కోట్ల రూపాయలు అందించే కల్పవృక్షాలు, నాణ్యత గల ఎర్రచందనం టన్ను కోటిరూపాయల వరకూ పలకడం చేత దీని గిరాకీ బాగా పెరిగిపోయింది. ఒక్కసారి ఈ చందనం లోడును స్మగ్లింగ్ ద్వారా విదేశాలకు తరలించామంటే చాలు కూర్చుని తిన్నా తరగని డబ్బు స్వంతం అవుతుంది. అటువంటి అరుదైన సంపద ఈ అడవుల్లో దాగి ఉండటం చేత అడవుల్లో స్మగ్లర్లు అక్రమంగా మాటువేసి కోట్ల రూపాయల సంపదను రోడ్డు సముద్ర వాయు మార్గాల ద్వారా దేశ సరిహద్దులు దాటించి వీటిని విదేశాలకు తరలించడం మొదలుపెట్టారు. దాంతో ఈ చెట్లు అంతరించిపోతున్న జాబితాలోకి చేరిపోయే స్థితికి వచ్చింది. 1973లో అరుదైన వృక్షజాతి జాబితాలో సైట్స్ (కన్వెషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎంరేంజర్డ్ స్పైసీస్)లోకి ఎర్రచందనాన్ని చేర్చారు. దీనివల్ల ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. ఆపై భారత ప్రభుత్వం అడవుల్లోని చెట్లను కొట్టడం చట్ట విరుద్ధంగా పేర్కొంది. పెంచడం మీదా, అమ్మడం మీదా కూడా ఆంక్షలు విధించింది. అయినప్పటికీ అది సరిహద్దులు దాటుతూనే ఉంది. నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంది. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంగా సుకుమార్ దర్శకంలో అల్లుఅర్జున్ నటించిన పుష్ప చిత్రం విడుదల తర్వాత చాలామందికి దీని విశిష్టత, ఇది దోపిడీ కాబడుతున్న విధానంపై ఎక్కువ చర్చ మొదలైంది.

అయితే ఈ సినిమాలో దీన్ని స్మగ్లింగ్ విషయంలో చూపించింది చాలా స్వల్పమే వాస్తవంలో ఇక్కడ జరుగుతున్న అక్రమ దందాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. దీని ప్రాధాన్యత, అంతర్జాతీయంగా ఇక్కడ జరుగుతున్న అక్రమ రవాణా, ఇది ఇక్కడ మాత్రమే ఎందుకు పెరుగుతుంది అనే విషయాలపై అనేక పరిశోధనాత్మక వ్యాసాలు కూడా వెలువడ్డాయి. అయితే ఇదే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని హైదరాబాద్‌కు చెందిన టైమ్స్ ఆఫ్ ఇండియా ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ సుధాకర్ రెడ్డి ఉడుముల దట్టమైన శేషాచలం అడవులలో పర్యటించి శోధించిన పరిశోధనలను ఆంగ్లంలో 'బ్లడ్ సాండర్స్- ది గ్రేట్ ఫారెస్ట్ హీస్ట్' పేరుతో ఓ పుస్తకాన్ని విడుదల చేశారు. దీనిలో శేషాచలం దట్టమైన అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా మొదలుకొని అది చైనా, జపాన్‌లో విలాసవంతమైన ఇళ్లకు చేరుకునే వరకు క్రూరమైన నేర నెట్‌వర్క్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం తొలి అడుగుగా చెప్పవచ్చు. ఎర్రచందనం విషయంలో ఇంతటి పరిశీలన జరిపి విశ్లేషణాత్మకంగా వివరింపబడిన పుస్తకం ఇప్పటి వరకు ఏదీ లేదనే చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ పుస్తకం ఆధారంగానే ఫ్రాన్స్‌లో 'ప్లానెట్ కిల్లర్స్' వెబ్ సీరీస్ రూపొందించారు. దీనిలో భాగంగానే ఎర్రచందనం స్మగ్లర్ షాహుల్ హమీద్ పర్యావరణ నేరాలకు సంబంధించి 'ఎగ్జిక్యూషనర్ ఆఫ్ ఫారెస్ట్' అనే ఎపిసోడ్ కూడా తీసుకురావడం జరిగింది.



## స్మగ్లింగ్

శేషాచలం టూ చైనా జపాన్ దేశాలకు తరలిపోతున్న ఎర్రచందనం స్మగ్లర్ల అక్రమ దందా అనేది ఉడ్‌కట్టర్, ఫైలన్, ట్రాన్స్‌పోర్టు, గౌడౌన్ ఇలా దశల వారీగా పెద్ద నెట్‌వర్క్ కలిగినదని చెప్పవచ్చు. దీని అక్రమ రవాణాలో సూత్రదారులు తెరవెనుక ఉంటే తెర ముందు పాత్రదారులు ఉంటారు. తెర ముందు ఉండే పాత్రదారులలో మొదటివారు చెట్లు కొట్టే కూలీలు. వీరికి స్మగ్లర్లకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధం ఉండదు. వీరిద్దరి మధ్య అనేక మంది ఏజెంట్లు ఉంటారు. ఈ ఏజెంట్లకు కూడా అసలు సూత్రదారుల సమాచారం తెలియకుండా చాలా పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తారు. అడవులలో ఏపుగా పెరిగిన ఎర్రచందన వృక్షాలు ఏ ప్రాంతంలో ఉన్నాయి అనేది స్థానికంగా ఉండే వాళ్లకు, ఫారెస్ట్ సిబ్బందికి తెలుస్తుంది. వీరి సహకారంతోనే కూలీలు అటవీ ప్రాంతానికి చేరుకుంటారు. ఒకప్పుడు ఈ చెట్లు నరకడానికి చుట్టుపక్కల గ్రామాల కూలీలను ఉపయోగించడం జరిగేది. కానీ, వీరి ద్వారా స్మగ్లింగ్ సమాచారం బయటకు పొక్కే అవకాశం ఉండడంతో, చెట్లను నరకడంలో నైపుణ్యం గల తమిళనాడుకు చెందిన కూలీలను ఎక్కువ వేతనం ఇచ్చి స్మగ్లిర్లు పురమాయిస్తున్నారు. ఉపాధి లేక కేవలం అధిక వేతనం వస్తుంది అనే అశతో ప్రాణాలకు తెగించి వీటిని నరకడానికి తమిళనాడు నుండి కూలీలు వస్తున్నారు. క్రూరమృగాలు సంచరించే ఈ దట్టమైన అడవులలోనికి వీరు ప్రాణాలకు తెగించి వెడతారు. ప్రధానంగా వీరు తమిళనాడులోని తిరువళ్లూరు, వేలూరు, కృష్ణగిరి, ధర్మపురి, తిరువణ్ణామళై, కాంచీపురం జిల్లాల్లోని పలు గ్రామాల నుండి వస్తుంటారు. ఎర్రచందనం చెట్లను నరకడంలో వీరు సిద్ధహస్తులు. ఈ ఊళ్లలో వేలాదిమంది ఇదే వృత్తిలో ఉన్నారు. వీరి కార్యక్షేత్రం మన రాష్ట్రంలోని శేషాచలం అటవీప్రాంతం, స్మగ్లర్లు స్థానికంగా ఉండే కూలీలను ఉపయోగించకుండా దూరాన ఉన్న తమిళ కూలీలను ఉపయోగించడానికి మరొక కారణం ఏమిటంటే తమిళ ఆదివాసీలు అయిన వీరికి అడవులులో సంచరించడం అనేది వెన్నతో పెట్టిన విద్య. అంతేకాదు అడవిలో వన్యమృగాల నడుమ ఏమాత్రం భీతి లేకుండా సంచరించగల ధైర్యం వీరి స్వంతం. పైగా వీరు దృఢకాయులై ఉంటారు. పనిలో త్వరగా అలసిపోరు. రెండు రోజులపాటు ఆహారం లేకపోయినా కూడా అలుపెరుగక పని చేయగల సామర్థ్యం వీరికి ఉంటుంది. చెట్లను నరకడమే కాదు వాటిని శుభ్రపరచి కొండ దిగువకు తీసుకురాగల సామర్థ్యం వీరికి ఉంది. కలపను రవాణా చేయడానికి ఏమైనా ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉందని సమాచారం వస్తే అడవిలోని నరికిన వృక్షాలను ఇక్కడే డంపులలో పాతిపెడతారు. అనుకూల సమయంలో మరలా వాటిని అడవి నుండి వాహనాల చెంతకు చేర్చి గమ్యానికి తరలిస్తారు. కొవిడ్ సమయంలో ఇలా నరికివేసిన వృక్షాలను ఎక్కువగా డంపులలో పాతిపెట్టడం జరిగింది. టాస్క్‌ఫోర్స్ బృందాల క్యాంబింగ్ సందర్భంలో ఇటువంటి డంపులు ఎన్నో బయటపడ్డాయి. తమిళకూలీల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే అంగబలం అర్ధబలం పలుకుబడి గల స్మగ్లర్లు చెట్ల నరికివేతకు వీరికి ఎక్కువ వేతనాలు ఇస్తూ ఉంటారు. ఉపాధి లభించని వీరి అధిక వేతనాలకు ఆశపడి ప్రాణాపాయమైన ఆ అక్రమదందాలో పావులు అవుతున్నారు. పోలీసులు దాడులు చేసినపుడు వారిని రాళ్లతో దాడులు చేసి చంపుతున్నారు. లేదా పోలీసుల చేతిలో హతులవుతున్నారు. అయినా ఈ వృత్తిని మాత్రం వారు వదలడం లేదు.

ముడుపులు చెల్లిస్తూ నిర్ణీత గమ్యానికి అంటే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, నేపాల్ బోర్డ్, చెన్నై, బెంగళూరు అవుట్ కట్ల వద్ద రహస్యంగా ఏర్పాటు చేసుకున్న గోడౌన్స్ నందు ఎర్ర చందనం నిల్వ చేస్తారు. ఇక్కడి నుండే విదేశాలకు పంపడానికి అవసరమైన పటిష్ట వ్యూహాలను రచించి గోడౌన్‌ల నుండి పోర్టులకు పంపి స్కానింగ్‌కు కూడా దొరకకుండా దర్జాగా స్మగ్లింగ్ చేస్తున్నారు. ఇది చెన్నపట్నం, కృష్ణపట్నం, దుబాయి, సింగపూర్, హాంకాంగ్.. అక్కడి నుంచి చైనా జపాన్, సౌత్ కోరియా దేశాలకు తరలిస్తున్నారు. రోడ్డు మార్గం ద్వారా చూస్తే బర్మా, మిజోరాం ద్వారా రవాణా చేస్తున్నారు. ఢిల్లీ, చండీఘడ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును మాత్రం ఒక వ్యూహం ప్రకారం నేపాల్‌కు

తరలిస్తున్నారు.
ఏది ఏమైనా ప్రతి ఏటా శేషాచలం అడవుల నుండి రెండు వేల టన్నులకు పైగా ఎర్ర చందనం విదేశాలకు తరలిపోతున్నదనేది మాత్రం సుస్పష్టం. దీనికి విస్తృత పరిధిలో ఉన్న ఈ అడవిలో ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడం చాలా కష్టం కావడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఎందుకంటే అడవి ఒక్కటే కానీ దీనికి లెక్కకు మించిన దారులు వుండటం నిఘా కోసం నియమించిన అటవీ సిబ్బంది అల్పంగా ఉండటం చేత అడవిని జల్లెడ పట్టడం సాధ్యం కావడం లేదు. ఈ స్థితిలో అప్పుడప్పుడు అధికారుల దాడులలో ఎర్ర చందనం లభించేది మాత్రం అత్యల్పమేనని చెప్పవచ్చు. అక్రమ రవాణా అవుతున్న మొత్తం కలపలో కేవలం 5 నుండి 10 శాతం మాత్రమే లభిస్తున్నదని అధికారిక లెక్కల ద్వారా తెలుస్తూ ఉంది.

**వాహనాల సీజ్**

అధికారులు దాడులు చేసిన సందర్భంలో కేవలం ఎర్ర చందనం దుంగలే కాకుండే వాటితో వాటిని తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేస్తూ ఉంటారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధీనంలో ఇలా సీజ్ చేసిన వాహనాలు వందలాదిగా ఉన్నాయి. వీటిలో అత్యంత ఖరీదైన వాహనాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం అధికారులు సీజ్ చేసిన కలపను అయితే వేలం వేస్తున్నది కానీ సీజ్ చేసిన వాహనాలను మాత్రం అలా ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పట్టినా వాటిని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. వీటిని కూడా వేలం వేయగలిగితే ప్రభుత్వ ఖజానాకు చాలా సొమ్ము సమకూరుతుంది.
ఏది ఏమైనా అక్రమ రవాణా విషయంలో అధికారులు పలు దాడులు చేయడం ద్వారా అధికారులు పట్టుకునేది గోరంత కాగా స్మగ్లర్ల విదేశాలకు తరలించుకుపోయేది మాత్రం కొండంత. సీజ్ చేసిన గోరంత ఎర్ర చందనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలిచి అమ్మే ప్రయత్నం చేస్తున్నప్పటికీ చాలా తక్కువ ధరకు మాత్రమే టెండర్లు రావడం జరిగింది. ఈ విషయంలో కూడా గ్లోబల్ వేలం సక్సెస్ కాకుండా చూడటంలో స్మగ్లర్లు సఫలీకృతం అయ్యారనేది బహిరంగ సత్యం.

**డేంజర్ జోన్‌లో ఎర్ర చందనం**

శేషాచలం అరణ్యాలు స్మగ్లర్ల గొడ్డలి వేటుకు విల విల లాడుతున్నాయి. ప్రపంచాన్నే తన వైపుకు చూసేలా పేరొందిన రాయలసీమలోని శేషాచలం అడవుల్లో అరుదైన ఎర్ర చందనం వనాలు నేడు మైదానాలుగా మారిపోతున్నాయి. దుర్భేధ్యమైన అడవుల్లో విలువైన ఎర్ర చందనం చెట్లను స్మగ్లర్లు నరికివేస్తూ జిల్లా, రాష్ట్ర, దేశ సరిహద్దులను దాటిస్తున్న ఫలితంగా రూ.కోట్ల విలువైన వన సంపద దొంగల పాలవుతోంది. పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతోంది. ప్రపంచ మార్కెట్లో అత్యంత విలువైన సంపదగా కాసులు కురిపించే ఎర్రచందనం నేడు అంతరించిపోయే దశకు చేరుకుంటున్నది. ఇప్పటికే 80 శాతం నాణ్యమైన సంపద స్మగ్లర్ల గొడ్డలి పోటుకు గురై ఎల్లలు దాటిందని చెప్పుకో వచ్చు. ఈ స్థితిలో కేంద్ర ప్రభుత్వం దీనిని అరుదైన వృక్ష జాతిగా గుర్తించింది. దీంతో ఎర్ర చందనం చెట్ల విక్రయాన్ని సైటస్ అనే కేంద్ర సంస్థ నిషేధించింది. అయితే ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు అంతర్జాతీయ మాఫియాగా ఏర్పడి ఎర్ర చందనం చెట్లను మరింతగా కబళిస్తున్నారు. అంతరించిపోయే ప్రమాదం ఉన్న రెడ్ లిస్టులోని ఎండేంజర్డ్ జాబితాలో దీనిని చేర్చడం జరిగింది. 2018 నుంచి ప్రమాదంలో పడే జాబితాలో ఈ చెట్టు ఉన్నట్టు ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయుసిఎన్) తెలిపింది.

**ప్రమాదంలో జీవ వైవిధ్యం**

శేషాచలంలో ప్రపంచంలో ఎక్కడా లేని నాణ్యమైన, అరుదైన ఎర్ర చందనం లభించడమే కాదు అరుదైన జంతు జాలానికి కూడా ఇది నెలవుగా నిలిచింది. ఇక్కడ ఎక్కడా లేని విధంగా అనేక రకాలైన వన్యప్రాణులు, జంతువులు ఉన్నాయి.
భారత ప్రభుత్వం యునెస్కో మార్గదర్శకాల మేరకు 2010లో ఈ శేషాచలం అటవీ ప్రాంతాన్ని బయోస్పియర్ రిజర్వుగా ప్రకటించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని 2012 జులైలో రాష్ట్ర ప్రభుత్వం కపిలతీర్థం వద్ద శేషాచల జీవ వైవిధ్య పరిశోధనశాలను కూడా ప్రారంభించింది. ఈ పరిశోధనలు ద్వారా ఎన్నో అరుదైన వృక్షాలు, జంతువులు, పక్షులు, కీటకాలను గుర్తించారు. అయితే మూడేళ్లకే బడ్జెట్ లేదని దీనిని మూసేసారు. తరువాత దీనిని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఎర్ర చందనం సంరక్షణ పట్ల ఎక్కువ దృష్టి పెట్టి జీవ వైవిధ్య సంరక్షణ, పరిశోధనలను నిర్లక్ష్యం చేశారు. అయితే వాస్తవంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరుదైన ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను నిలుపుదల చేయలేకపోవడమే కాదు అంతే అరుదైన జీవ వైవిధ్యాన్ని సైతం కాపాడలేకపోతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో విఫలమవతున్నాయి.

**ఎగుమతులపై ఆంక్షల తొలగింపు**

అంతరించిపోయే ప్రమాదం అంచుల్లో ఉన్న అరుదైన జాతి ఎర్ర చందనం కావడంతో పాటు గతంలో మన దేశంలో ఎర్ర చందనం అక్రమ రవాణాపై పలు ఉదంతాలు వెలుగు చూడడంతో సీఐటీఈఎస్ భారత్‌ను పటిష్టమైన సంరక్షణ చర్యల్లో భాగంగా ఎర్ర చందనం ఎగుమతులపై పరిమితిని విధించి ప్రతికూల



దేశాల జాబితాలో చేర్చింది. గణనీయ వాణిజ్య సమీక్ష(ఆర్ఎస్‌టీ) నుంచి తొలగించింది. 2004 నుంచి ఈ పరిమితి కొనసాగుతోంది. నిబంధనలు పాటించని దేశాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఈ జాబితా ద్వారా సీఐటీఈఎస్‌కు దఖలు పడింది. ఏటేటా ఈ జాతి చెట్ల స్థితిగతులను పరిశీలించి ఎగుమతి పరిమాణాన్ని సైట్స్ స్థాయీ సంఘం నిర్దేశిస్తూ ఉంటుంది. అయితే మన దేశం గత 19 ఏళ్లుగా సైట్స్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించటమే కాకుండా ఎర్ర చందనం వృక్ష జాతి పరిరక్షణ చర్యలు

సమర్థవంతంగా పాటించిన వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నివేదిక ఆధారంగా ప్రస్తుతం ఎగుమతులపై అమల్లో ఉన్న పరిమితిని తొలగిస్తూ సైట్స్ స్థాయీ సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామం ఎర్ర చందనం తోటలు సాగు చేసే రైతులకు గొప్ప ప్రోత్సాహాన్నిస్తుంది.

దీనివల్ల రైతులు ఎర్ర చందనం వ్యాపారంలో రైతులు చట్టబద్ధంగానే ప్రవేశించే వీలు కలగడమే కాకుండా మంచి ఆదాయం కూడా రైతులు పొందే అవకాశం లభించింది. ఇక ఎంతయినా రైతులు ఎగుమతి చేయొచ్చు. మంచి ధర వచ్చేవరకు నిల్వ చేసుకొని మరీ ఎగుమతి చేసుకోవడానికి మార్గం సుగమమయ్యింది. ఆధునిక టెక్నాలజీతో స్మగ్లింగ్ కట్టడి ఎంత నిఘా వేసినా దీని స్మగ్లింగ్‌ను కట్టడి చేయలేని పరిస్థితులలో ప్రభుత్వం ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను పటిష్టంగా కట్టడి చేయడానికి అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీని ప్రకారం హై రిజల్యూషన్ శాటిలైట్, లైడార్ డేటా ద్వారా ప్రతి చెట్టును పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. అడవిలో చెట్లను నరికినపుడు అవి కూలిపోయిన సందర్భంలో తెలుసుకునేందుకు సౌండ్ అండ్ మోషన్ సెన్సార్‌ను కొన్ని కీలకమైన పాయింట్లలో అమర్చడానికి సిద్ధం అయ్యారు. అటవీ ప్రాంతాల్లోని రోడ్లు, వ్యూ పాయింట్ల వద్ద హై రిజల్యూషన్ ఐపీ కెమెరాలు అమర్చడం ద్వారా చిన్న అలికిడి వచ్చినా తెలిసిపోయేలా నిఘాను పటిష్టం చేసేందుకు రంగం సిద్ధమైంది. డ్రోన్ కెమెరాలతో అడవిలోని మారుమూల ప్రాంతాలను సైతం స్పష్టంగా జల్లెడ పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఉండే స్కానర్లకు బదులు అడ్వాన్స్‌డే వెహికల్ స్కానర్లను వినియోగించను న్నారు. అలాగే అటవీ ప్రాంతాల్లో తిరిగే వాహనాల సమాచారం తెలుసుకునేందుకు నంబర్ ప్లేట్ రీడర్స్ ఉన్న ఆటోమేటిక్ కెమెరాలను ఏర్పాటు చేయడానికి కూడా రంగం సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లు వలన ఇకముందు స్మగ్లింగ్‌కు ఎటువంటి అవకాశం కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు. దీనితో పాటు ప్రతి ఎర్ర చందనం వృక్షానికి జియోటాగ్ వేసి నిరంతరం పరిరక్షించే ఒక పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే సూచనలు కూడా వస్తున్నాయి. అయితే స్మగ్లర్లు మాత్రం ఎప్పటికప్పుడు ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ స్మగ్లింగ్ కొనసాగిస్తూనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధానికి సంబంధించి ఇంతవరకు పదునైన చట్టాలు లేకపోవడం.

పట్టుబడినా బెయిల్‌పై బయట పడుతున్నారు. మళ్లీ అదే దంతా కొనసాగిస్తున్నారు. గత పదేళ్ల కాలంలో దీనికి అడ్డూ అదుపూ లేకపోవడంతో బడా బాబులు, రాజకీయ నాయకులు, స్మగ్లర్లు ఎర్ర చందనం అక్రమ రవాణాను ఒక బిజినెస్‌లా భావిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. స్మగ్లింగులో జీవనోపాధి కోసం వచ్చిన కూలీలే బలిపశువుల వుతున్నారు. ఇప్పటివరకూ సూత్రదారులు అనేది బయట పడలేదు.

ఎర్ర చందనంపై ఇకనైనా ప్రభుత్వం సరైన దృష్టి సారిస్తే మోడు వారిన మొద్దుల నుంచి చిగురించి ఎర్ర చందనం మొక్కలైనా భవిష్యత్ తరాల కోసం కాపాడు కోవచ్చు. ప్రభుత్వం కౌంట్ డౌన్ అయిన ఎర్ర చందనం చెట్లను కాపాడుకునేందుకు ఏ రకమైన చర్యలు చేపడుతుందో చూడాలి మరి. అక్కడి నుంచే ఈ స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారు. మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ దందా వెనుక రాజకీయ నాయకులు ఉండగా లేనిది తాము ఉంటే తప్పేమిటి? అని భావించి కస్టమ్స్ అధికారులు కూడా స్మగ్లర్లతో కుమ్మక్కై ఎర్ర చందనం ఎగుమతి చేస్తున్న భాగోతం కూడా ఒకటి బయట పడింది. బయట పడకుండా ఇంకెన్ని భాగోతాలు నడిచాయో, నడుస్తున్నాయో ఆ భగవంతునికే ఎరుక.

## పార్టీలకు ఎర్ర నిధులు

ఎర్ర చందనం స్మగ్లింగ్ కట్టడికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇది నిరాటంకంగా కొనసాగడానికి చందనం స్మగ్లర్లకు కడప, చిత్తూరు జిల్లాల్లో పలువురు అండదండలు అందించడమేనని చెప్పవచ్చు. దీనికి ప్రతిఫలంగా వీరికి పెద్ద ఎత్తున డబ్బు అందుతుంది అనేది స్థానికుల అభిప్రాయం. అంతేకాదు, ఈ స్మగ్లర్లు ఎర్ర చందనం అక్రమ దందా ద్వారా సంపాదించిన వందల కోట్ల ఆస్తులలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోనూ కొన్ని పార్టీలకు ఎర్ర నిధులు అందిస్తున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి.

ఎర్ర చందనం స్మగ్లింగ్ సూత్రదారులలో ప్రధాన వ్యక్తి హమీద్. ఎర్ర చందనం స్మగ్లింగ్ గురించిన ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ ఇతని పేరు వినిపిస్తుంది. తమిళనాడులోని అభిరామంకు చెందిన ఇతనిని గాడ్ ఫాదర్ ఆఫ్ ట్రాఫిక్‌గా పిలుస్తారు. ఎందుకంటే ఇతడు కరడు గట్టిన ఎర్ర చందనం స్మగ్లర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలప స్మగ్లింగ్ కేసులకు సంబంధించి ఇంటర్ పోల్ వెతుకుతున్న మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్. 2016 నుంచి ఇతని గురించి వెతుకుతున్నారు. అతడిపై



అనేక నేరారోపణలు ఉన్నాయి. ఆస్తులు భారీగా కూడబెట్టాడు. హమీద్ సంపద సుమారు 120 మిలియన్ డాలర్లుగా అంచనా. ఇండియన్ పోలీసులు మొదటి సారి అరెస్ట్ చేసిన తర్వాత, షాహుల్ హమీద్ దుబాయ్‌కి పారిపోయాడు. అక్కడి నుంచే అతడు నేర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధంగల గంగిరెడ్డి, రామనాథరెడ్డి, బాషా భాయ్ వంటి ఎవరిని అరెస్టు చేసినా వారి వెనుక ఉన్న పెద్ద తలకాయల గుట్టు రట్టు చేయలేక పోయారు. ఎర్ర చందనపై ఇకనైనా ప్రభుత్వం సరైన దృష్టి సారిస్తే మోడు వారిన మొద్దుల నుంచి చిగురించే ఎర్ర చందనం మొక్కలనైనా భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవచ్చు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంట్ డౌన్ అయిన ఎర్ర చందనం చెట్లను కాపాడటమే కాకుండా శేషాచల జీవ వైవిధ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ❍

# ఓ ఆదర్శ ఆఫీసర్



**మనోజ్‌ది** మధ్యప్రదేశ్ రాష్ట్రం. మొరానాబాద్ జిల్లాలోని బిల్‌గ్రామ్ అనే కుగ్రామం. తండ్రి వ్యవసాయశాఖలో చిరుద్యోగి కానీ పై అధికారి అక్రమాలని బయటపెట్టినందుగ్గాను సస్పెండ్ అయ్యాడు. దాంతో వాళ్లది ఆదాయంలేని ఇల్లయింది. ఆ సమయంలోనే మనోజ్ ఇంటర్ పరీక్షలకి హాజరాయ్యడు. అక్కడి బదులు తమ పాస్ పర్సంటేజీని ఎక్కువగా చూపించుకోవడం కోసం విద్యార్థుల చేత మాస్‌కాపీయింగ్ చేయించడం ఆనవాయితీ.

మనోజ్ సహా ఓ రోజు విద్యార్థులందరూ యథేచ్ఛగా చూసి రాస్తుండగా అక్కడికొచ్చారు దుష్యంత్‌సింగ్ అనే సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం). ఇదివరకటి అధికారుల్లా చూసిచూడనట్లు వెళ్లిపోలేదాయన. కాపీయింగ్‌ని ఆపేశాడు. పరీక్షలున్న అన్ని రోజులూ అక్కడే మకాం వేశాడు. ఫలితంగా ఆ స్కూల్ నుంచి ఇద్దరే పాసయ్యారు. మనోజ్ అయితే ఒక్క హిందీలో తప్ప అన్ని సబ్జెక్టుల్లోనూ ఫెయిలయ్యాడు. అయితేనేం ఆ అధికారిలోని నిజాయితీ, ముక్కుసూటితనం మనోజ్‌ని కట్టిపడేశాయి. తానూ అలాంటి అధికారి కావాలనుకున్నాడు. అందుకేం చేయాలో తెలియలేదు. పొట్టకూటి కోసం గ్రామంలోని మిగతా యువకుల్లాగే తాను క్వారీలో కూలికెళ్లసాగాడు. ఓసారి మనోజ్ ఫ్రెండ్సందరూ కలిసి ఓ క్రికెట్ టోర్నమెంటు ఏర్పాటు చేశారు. అందులో ఆడాలంటే రూ.10 కట్టాలి. మనోజ్ ఆ కాస్త రుసుమూ చెల్లించలేకపోవడంతో అతణ్ని ఆటలో చేర్చుకోకుండా కేవలం కామెంటేటర్‌గా ఉండమన్నారు. ఆ టోర్నమెంటుకి ఎస్‌డీఎం దుష్యంత్ సింగ్ అతిథిగా వచ్చారు. మనోజ్‌కి మిగతా సబ్జెక్టులు రాకపోయినా హిందీసాహిత్యంలో మంచి పట్టుంది. తనకి తెలిసిన కవితల్ని వల్లిస్తూ కామెంట్రీ చేసిన తీరు దుష్యంత్‌కి బాగా నచ్చింది. ఆ రోజు విజేతలతోపాటూ మనోజ్‌నీ ప్రత్యేకంగా అభినందించాడు. అప్పుడడిగాడు అతణ్ణి 'సార్ నేనూ మీలాగా అధికారిని కావాలంటే ఏం చేయాలి?' అని. 'ముందు డిగ్రీ చేయాలి. తర్వాత రాష్ట్రప్రభుత్వం నిర్వహించే గ్రూప్స్ పరీక్షలు రాయాలి' అన్నాడు. 'సార్ నేను క్వారీ కూలీని చేయగలనా?' అని అడిగాడు. 'జీవితాన్ని ఎక్కడి నుంచైనా రీస్టార్ట్ చేయొచ్చు' అన్నాడాయన భుజం తడుతూ.

దుష్యంత్ సింగ్ మాటలు మనోజ్‌పైన బాగా పనిచేశాయి. కూలీకెళుతూనే మళ్లీ ఇంటర్ పూర్తి చేశాడు. అమ్మ రెండువేల అప్పు తెచ్చిస్తే గ్వాలియర్‌లోని ఎంఎల్‌బీ కాలేజీలో బీఏలో చేరాడు. ఇంగ్లిషులో వీక్‌గా ఉండటంతో ప్రత్యేకంగా కోచింగ్ తీసుకోవాలనుకున్నాడు. మరి డబ్బు? గ్వాలియర్‌లో ఇంగ్లిష్ కోచింగ్ క్లాసులు తీసుకుని ఓ మాస్టారికి వంటావార్పుతోపాటు బట్టలు ఉతకడం, మరుగుదొడ్లు శుభ్రం చేయడం సహా అన్ని పనులూ చేస్తూ ఫీజు లేకుండా కోచింగ్ క్లాసులకి హాజరయ్యాడు. ఆ తర్వాత, గ్వాలియర్‌లోని వివేకానంద కేంద్రం వాళ్ల లైబ్రరీలో వాచ్‌మ్యాన్, సెక్యూరిటీ గార్డుగా కుదిరాడు. లైబ్రరీలో తన పనులన్నీ అయ్యాక అక్కడున్న పుస్తకాలు చదివేవాడు. గ్రూప్ వన్ పరీక్షల కోసం సిద్ధం కావడానికి అదెంతో ఉపయోగపడింది కానీ. ఓ రోజు లైబ్రరీ మేనేజర్ రూ.2 వేలు కాజేసినట్టు ఇతనిపైన అవినీతి ఆరోపణ చేస్తే తట్టుకోలేకపోయాడు. మిగతా నిర్వాహకులు వద్దంటున్నా వినకుండా అక్కడ మానేసి ఓ రైసు మిల్లులో ఉద్యోగానికి కుదురుకున్నాడు. అక్కడ రోజంతా ఊపిరి సలపని పని. దానికితోడు అక్కడి ఊక పడక శ్వాసకోశ సమస్యలొచ్చి చిక్కిశల్యమయ్యాడు. అయినా సరే గ్రూప్-2కి చదువుతూనే ఉండేవాడు. పాండే అన్న ఫ్రెండ్ సాయపడటంతో మిల్లు పని నుంచి బయటపడి అతని రూములోనే ఉంటూ గ్రూప్-1కి సిద్ధమయ్యాడు. కానీ మరో నెలలో పరీక్ష అనుకుంటుండగా ఆ ఏడాది గ్రూప్ పరీక్షల్ని రద్దు చేస్తున్నట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. దాంతో సివిల్స్‌వైపు దృష్టి మరల్చాడు. 'ఇంటర్ ఫెయిలయ్యాడు, సివిల్స్ రాస్తాడట, ఆశకైనా కాస్త అంతుండాలి' అంటూ అందరూ హేళన చేసినా ఓ ఫ్రెండ్ ఇచ్చిన రూ.10వేల డబ్బుతో కోచింగ్ కోసం ఢిల్లీ వెళ్లాడు.

**ఓటమిని ఎదుర్కొని**

ఢిల్లీకి చేరిన మనోజ్ తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ గట్టెక్కినా మెయిన్స్ పోయింది. ఆ తర్వాతి రెండు ప్రయత్నాల్లోనూ ఓటమి తప్పలేదు. దాంతో సివిల్స్ రాయాడానికున్న నాలుగు అవకాశాల్లో మూడు విఫలమయ్యాయి.

చిట్టచివరి ప్రయత్నమే మిగిలింది. చావోరేవో అన్న పరిస్థితిల్ల మనోజ్ తన లోపాల్ని నిజాయితీగా విశ్లేషించుకున్నాడు. ఆ సాధన సాగుతుండగానే రెండేళ్లపాటు అతనికి తోడుగా ఉన్న పాండే అనారోగ్య కారణాలతో ఊరెళ్లిపోయాడు. దాంతో తలదాచుకునే చోటులేక మరో స్నేహితుడి పంచన చేరాడు.

ఇన్ని ఈతిబాధల మధ్యే సివిల్స్‌లో 121వ ర్యాంకు సాధించాడు మనోజ్. ప్రస్తుతం ముంబయి మహానగరానికి అడిషనల్ కమిషనర్‌గా ఉంటున్న మనోజ్ జీవితాన్ని అతడి మాజీ రూమ్మేట్ పారే ఉరఫ్ అనురాగ్ పాథక్ 'ట్వెల్త్ ఫెయిల్' అనే పుస్తకంగా రాశాడు. దాన్నే ప్రముఖ హిందీ దర్శకుడు విధూ వినోద్ చోప్రా సినిమాగా తీసి సూపర్‌హిట్ చేశాడు.

వారానికి ఒక్కనాడు
అమ్మ చేత పుదిచ్చుకుని
తెల్ల పిండి, కుంకుమ బొట్లతో సింగారించుకోడానికి
సుక్కపొద్దు యేలు పట్టి నిదుర లేసే అమ్మ కోసం
మూలకున్న మూడు రాళ్ళు దినాం ఎదురుసూపులు.
నిప్పు రాజేసి నీల్లెసరు పెట్టంగా
అమ్మ చెప్పే కుతకుతా కడుపుడికే పోరు కథలతో
భగ భగా మండే అగ్గిగోళాలయ్యేవి

# పొయ్యిరాళ్లు

అమ్మ చెప్పే మాటలన్నీ ఏ అడ్డూ చెప్పకుండా వినే
ఆస్థాన శ్రోతలు పొయిరాళ్ళు.
కళ్లు దెరిసీ మూసేదాకా పొయిరాళ్లే
అమ్మకెప్పుడూ తోడుండే స్నేహితురాండ్లు.
అమ్మ బాధనో కోపాన్నో దుఃఖాన్నో
వలపోసుకుంటున్నపుడు
అమ్మ కండ్లు పొయిరాళ్ళు ఒక్క తీరుగనే ఉండేటివి.
అమ్మ బతుకు పోయిరాళ్ల బతుకు ఒక్కతీరే
ముప్పొద్దులా కమిలి కమిలి మంది కోసం మసిబారుత్తై
బతుకంతా లోలోపల మశిలి మశిలి శీరికవారుత్తై.
పొయిరాళ్ళు
మా ఇంటి పటువను పదిలంగా నిలబెట్టి
మా కడుపుల ఆకలిని జోకొట్టి
పొద్దూకల మాకోసం ఎండకెండి వానల తడిశి
అక్కర తీరినంకా తీశవతల విశిరేసిన
గమ్మున ఏ శెట్ల సాటుకో ఏ పుట్ట మాటుకో పడుండి
మా మీద ఓ కన్నేసి ఉంచుతయి
అచ్చం మా అమ్మలాగే



అక్కరైతే మళ్లా వచ్చి మా ఇంటి పటువను నెత్తికెత్తుకోడానికి
ఎపుడన్న పొయిరాళ్ళు అటూ ఇటూ ఐనయా
అంతే ఇగా..
మా ఇంటి పటువ పటుక్కున పలుగుడు ఖాయం.

**- దిలీప్ వి.**

## ఈవారం కవిత్వం

# మౌన శకలం



**మీరే** నన్ను మారుస్తున్నది
నేను నడిచే దారిని
వంపుతూ విరుస్తున్నది
మీవైనవి చేయిస్తూ నాచే/ మిమ్మల్నిగా రూపాంతరం
గావిస్తూ ఆవిరి చేస్తున్నది!
ఇంకేమి మాటాడను/ నేనేమన్నా అది మీరే
మీ నుంచి వచ్చినవిగానే ఉంటయ్.
ఎలా ఉన్నా మీకు అసంతృప్తే
మౌనంగా మెలిగినా..
కనిపించకుండా పోయినా..
నా అస్తిత్వం మీ కంట పడకుండా
మీకు ఉపశమనం ఇవ్వనా!
నా గాలి లేకుండా ఒక బుడుగనై
నన్ను నేను వదిలేసుకుంట
ఆ శూన్యంలోకి
ఒకానొక వ్యోమనౌకలోకి
ఆ ఖాళీలోకి
ఆ నల్లని అనంతంలోకి
వినిపించకుండా పూర్తిగా..
ఒక శకలమై ముక్కలుగా
రాలిపోత ఆ మధ్యలోనే..
ఎవ్వరికీ చెందక దేనిలో ఇమడక
ఒక విశ్వజనీన సూత్రమై మిగులుతా.



**- రవీర్**

# వంశీధర్ నానీలు పరిమళం



సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగిస్తున్న కుడికాల వంశీధర్, సాహిత్యం వైపు మొగ్గుచూపి తన తొలి ప్రయత్నంగా నానీల వసంతం పేరిట ఓ లఘు కవితా సంపుటికి శ్రీకారం చుట్టాడు. 'అమ్మ/చంద్రుణ్ణి పిలుస్తుంది/ నిజానికి అమ్మే/ ఓ చందమామ' అణువణువునా వాత్సల్యం వెదజల్లే మాతృమూర్తిని చల్లటి వెన్నెలను విరజిమ్మే చందమామతో పోల్చి పరవశిస్తున్నాడు. అమ్మ వస్తువుగా చాలా నానీలే రాశాడు. 'వానాకాలం/ వచ్చేసింది/ నగరవీధుల్లో/ నదులు పొంగుతున్నాయి' కాస్తంత వాన పడితేచాలు..హైదరాబాద్ పరిస్థితి ఏమిటో కళ్లముందు కదలాడ్తుంది. 'అమావాస్య ఆకాశం/ ఖాళీకంచంలా వుంది పున్నమైతే/ వెన్నెల వడ్డించేది' చక్కటి ఊహ. నానీకరించడంలో వంశధర్ ప్రతిభ ద్యోతకమవుతోంది. 'పదాల్లో క్లుప్తత/ భావంలో గాఢత/ నా కవితను/ మెచ్చదా జనత' అంటున్న ఈ యువకవి లఘు కవితల్ని పాఠకులు ఏ మేరకు మెచ్చుకుంటారో చూడాలి. 'ముందు మాట/ ముప్పైలావులు/ అసలు కవిత్వం/ ఆరు లావులు' దాదాపు 60 పుటల చిరుగ్రంధం 'నానీల వసంతం' ముగ్గురు ముందు మాటలు రాశారు. దీనికేమంటారు వంశీధర్? ఏమాటకామాట..ఈ సంపుటిలో నాణ్యమైన నానీలు చాలానే వున్నాయి. **(నానీల వసంతం, రచన: కుడికాల వంశీధర్, వెల: రూ 60, ప్రతులకు: ఇ.నం.2-108/7/38/1, ప్లాట్ 38, బి.ఎల్.నగర్, 4వ వీధి, బోడుప్పల్, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

# అక్షరయాన అభినందన దర్పణం



సాహితీవేత్తల అభినందన సంచికలు, కేవలం వారి జీవన ప్రస్థానంలోని, రచనలకే పరిమితం అయితే వారి సంపూర్ణ జీవన వ్యక్తిత్వపు విలువలు, సామాజిక అభ్యుదయ సేవా విశేషాలు, స్వయం కృషితో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సాగిస్తున్న స్థితిగతులు ఆవిష్కరించబడే అవకాశం వుండదు. 78 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సౌమ్యులు, స్నేహశీలి, నేటికీ సేవాదృక్పధంతో తన జీవన యానాన్ని సార్ధకం చేసుకొంటున్న రచయిత కూర చిదంబరం. 60ఏళ్ల అక్షరయానం గురించి సంపాదకవర్గం, ప్రముఖ రచయితలు కాబట్టి, అభినందన సంచికను, వారి జీవన ప్రతిభావిశేషాలను విశ్లేషణ, వివేచన, ప్రతిభాసంపన్నతాయుక్తంగా సుమారు 62మంది రచయితలు, ఆత్మీయులు, సన్నిహితులు అభిప్రాయాలతో తీర్చిదిద్దారు. ముఖాముఖిలు, ముందుమాటలు, రచనలపై అభిప్రాయాలు అన్నీ అందరూ లబ్ద ప్రతిష్ఠత సాధించిన ప్రముఖులు కావడంతో సమున్నత ఈ సద్గ్రంధానికి, కధానాయకులైన చిదంబరం ప్రతిభా సమున్నత విశేషాల దర్పణంగా, ఆకట్టుకొంటోంది. సమాజహితాన్ని ఆకాంక్షిస్తూ అభ్యుదయ పధగామిగా సాగుతున్న సౌజన్యశీలి శ్రీ చిదంబరం, కథలు, సమీక్షలు, గేయాలు, వ్యాసాలు, నాటికలు, జీవిత చరిత్రలు, బాలసాహిత్యంతో బహుముఖీనంగా తెలుగు పాఠకుల ఆదరణ, అభిమానం, కీర్తి పొందుతున్నారు. **(కూర చిదంబరం అభినందన సంచిక, ప్రధాన సంపాదకులు: సుధామ, సంపాదకులు: తంగిరాలచక్రవర్తి, వెల: రూ 300, ప్రతులకు: సౌమిత్రి ప్రచురణలు, 6-2-228/19, పద్మారావునగర్, సికిందరాబాద్) – యర్రమిల్లి**

**పుస్తక సమీక్ష**

ఒక మంచి రచన చదివాక, పుస్తకం మూసినా, రచన తాలూకు పరిమళం కొంతసేపు మన చుట్టూ గుబాళిస్తూనే ఉంటుంది. రచనల్లోని పాత్రలు, సన్నివేశాలు సంభాషణలు మరి కాసేపు మనల్ని పలకరిస్తూ ఉండిపోతాయి. ఈ సంపుటిలోని 42 గల్పికలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చును. రెండుపేజీలు సాగి, అకస్మాత్తుగా ఆగి, పాఠకుడికి కొంత విభ్రమనం, విస్మయం, మరికొంత సంభ్రమం కలిగిస్తాయి. కొసమెరుపులు, కొసమలుపులు

## మనసుకు నచ్చే గల్పికలు 42



మిసమిసలై 'బంగీజంప్'లా క్షణం నిశ్చేష్టుడిని చేస్తాయి. కళ్లెదుట కనిపించే సామాన్య సంఘటనలే రచయిత కల్పనాచాతుర్యంతో మిలమిల మెరుస్తాయి. ఏమీ ప్రాధాన్యత లేని 33 సంఖ్యకు ప్రాధాన్యత కల్పించటం, 13వనెంబర్ బెడ్‌మీద పేషెంట్ చావాలని ఒకరు కోరుకుంటే బ్రతికించాలని మరొకరు తాపత్రయపడడటం పాపపుణ్యాల తూచే మారాజుకు (యమధర్మరాజుకు) గొప్ప సందిగ్ధమే. చిన్న కథ, చిట్టి కథ కార్డు కథ కాలమ్ దాటని కథ ఏ పేరుతో సంభోదించినా ఆ గల్పికలు నిక్కమైన నీలాలు. సంపుటికి ఇచ్చిన టైటిల్, కథలకిచ్చిన ఒక టూత్రీ, త్రీటూ, బామ్-బాంబ్, మచ్చ, షరా..మామూలే! లాంటి టైటిల్స్ తోనే కథకుడి ప్రతిభ ద్యోతకమవుతుంది. ఆద్యంతమూ కథలన్నీ ఆసక్తికరంగా సాగుతాయి.
**(ముప్పైమూడు గల్పికలు, రచన: దర్భముళ్ల చంద్రశేఖర్, వెల: రూ 100, ప్రతులకు: 303, ఆర్ఆర్ టవర్స్, రైతుబజార్ ఎదురుగుండా, గోపాలపట్నం, విశాఖపట్నం)**

**- కూర చిదంబరం**

వంశీ ఆర్ట్ థియేటర్స్ వారి ప్రచురణగా తిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితంగా ఈ యాత్రాచరిత్ర పాఠకులకు రచయిత్రి అందించారు. ప్రముఖ రచయిత డా॥యండమూరి వీరేంద్రనాథ్, డా॥వంశీరామరాజు, డా॥తెన్నేటి సుధాదేవి, శైలజ

## 'నా విహంగ యానం విదేశీ విహారం'



సుంకరపల్లి చక్కటి ముందు మాటలు రాసారు. రచయిత్రి మాల్దీవులు, శ్రీలంక, సింగపూర్, లండన్, దుబాయ్, బాలి, అంకోర్‌వాట్, ఢాకాలాంటి దేశాల పర్యటనలు, అనుభవాలు రాసారు. యాత్రాచరిత్రలు అనగానే ఏనుగుల వీరాస్వామి 'కాశీ యాత్ర' ఆదినారాయణ 'భ్రమణకాంక్ష' గుర్తుకొస్తాయి. శ్రీలంకలోని బుద్ధుడి స్థూపాలు, గుహలు, కాండీ పట్టణం, కాండీలేక్, ఏనుగుల ప్రాంతాలు, ఐరోపా అద్భుతాలు, బంగ్లాదేశ్ రాజధాని ఢాకా, దేవతలు నడయాడిన భూమి బాలీ, విశేషాలు అద్భుతంగా నాగేశ్వరి రాసారు. మాల్దీవులకు ప్రయాణమవడంతో రచయిత్రి తన ప్రయాణంలోని ఎన్నో విశేషాలను మొదటి ఘట్టం ఆరంభమవుతుంది. తన యాత్ర పర్యటన ప్రాంతాల చారిత్రక అంశాలు వివరంగా రాయడం బాగుంది. పాఠకులకీ అర్థం అయ్యేలా యాత్ర రచన రచయిత్రి అద్భుతంగా రాసారు. వంశీ స్వర్ణోత్సవ కానుకగా యీ పుస్తకం తేవడం బాగుంది. నాగేశ్వరి రూపాకుల యాత్రా రచన ప్రశంసనీయం. **(నా విహంగయానం విదేశీవిహారం, రచన: నాగేశ్వరి రూపాకుల, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

# వేడుకలకు అరబ్ స్వీట్స్





**గులాబ్** జామూన్, జిలేబీ..ఇవి లేని నగరాలనూ పట్టణాలను ఊహించగలమా లేదు కదా! మనం ఎంతో ఇష్టంగా తినే ఈ స్వీట్లు పర్షియా నుంచి మొఘల్స్ ద్వారా మనదేశంలోకి వచ్చాయి. మరెన్నో రుచిల్ని అద్దుకుని అచ్చంగా మనవే అన్నట్లుగా మారాయి. ఆ మారిగానే ఈమధ్య తుర్కియే నుంచి వచ్చిన లోకమ్, బక్లవా, కునాఫా వంటివన్నీ మనదైన రుచిల్ని అద్దుకుని మరీ అలరిస్తున్నాయి. ఇన్‌స్టా రీల్స్ లోనూ తిరగేస్తున్నాయి. ఆ దేశ జాతీయ స్వీటు, బక్లవా రకాలకైతే లెక్కే లేదు. భిన్న రూపాల్లో విభిన్న రుచుల్లో చవులూరిస్తుంది. బర్డ్‌నెస్ట్ రూపంతో వస్తున్న బక్లవా చూపులకీ అందంగా ఉండటంతో స్టార్ హోటళ్లలోనూ స్వీట్ల ప్యాకుల్లోనూ కూడా కనిపిస్తోంది. అదీగాక, డ్రైఫ్రూట్లూ నట్సూ ఎక్కువగా వాడటంతోపాటు ప్రత్యేకమైన పద్ధతిలో చక్కెర పాకం లేదా తేనె చేర్చడంవల్ల తుర్కియే స్వీట్లు ఒకలాంటి రుచితో ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

## నోట్లోనే కరిగిపోయే లోకమ్



మధ్యతూర్పు దేశాల్లో ఒకటైన తుర్కియే కార్పెట్లూ, పింగాణీ వస్తువుల తయారీతోపాటు నోట్లో పెట్టుకుంటే కరిగిపోయే మిఠాయిలకీ పెట్టింది పేరు. పర్షియా, అరబ్ మూలాలున్న స్వీట్లు కూడా తుర్కియేలో కొత్త రుచుల్ని అద్దుకుని మృదు మధురమైన రుచిలో తయారవుతాయి. పూర్వం హాసిబేకిర్ అనే వ్యక్తి ఓ మిఠాయి దుకాణాన్ని పెట్టాడట. అతనికి చాలామంది భార్యలు ఉండటంతో వాళ్లందరినీ మెప్పించేందుకు రకరకాల స్వీట్లను తయారుచేసేవాడట. విభిన్న ఫ్లేవర్లలో ఉండే టర్కిష్, డిలైట్ అలా వచ్చిందేనట. దీన్నే స్థానికులు లొకమ్ లేదా లుక్మా అంటారు. 19వ శతాబ్దంలో ఆ దేశాన్ని సందర్శించిన బ్రిటిష్ యాత్రికుడికి బాగా నచ్చడంతో దీన్ని ర్కిష్ డిలైట్‌గా పిలిచారట. క్రమేణా ఇది అంతటా ప్రాచుర్యం పొందింది. మైదా, కార్న్‌ఫ్లోర్లర్, నట్సూ, పండ్లూ, సిట్రిక్ ఆమ్లం కలిపి చేసే లొకమ్ రకరకాల ఫ్లేవర్లలో నోరూరిస్తుంటుంది.

## డ్రైఫ్రూట్స్‌ల బక్లవా!



బక్లవా..నట్సూ డ్రైఫ్రూట్లూ నింపిన పొరల పొరల ఫిలో పేస్ట్రీ లేదా పఫ్‌లా ఉండే డెజర్ట్ కమ్ స్వీట్. గ్లూటెన్‌లేని గోధుమ పిండికి నీళ్లు, కరిగించిన వెన్న కలిపి పలుచని పొరలుగా చేస్తారు. వీటినే ఫిలో స్వీట్లు అంటారు. ఈ స్వీటు నిజానికి అరబ్బు దేశాల్లో పుట్టింది. కానీ దీన్ని తురుష్కులు తమదైన పద్ధతిలో తయారు చేయ దంతో తర్కియే డెజర్ట్‌గానే పేరొందింది. నైటింగేల్ నెస్ట్, పిరమిడ్, స్టార్, లేడీ ఫింగర్..ఇలా రకరకాల ఆకారాల్లోనూ పిస్తా, చాక్లెట్, వాల్‌నట్ ఇలా భిన్న రుచుల్లోనూ ఆరోగ్యకరమైన బక్లవాల్ని మనవాళ్లూ చేసేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక దుకాణాలు రావడంతోపాటు స్వీట్ షాపుల్లోనూ బక్లవా వెరైటీలను అమ్ముతున్నారు. వేడుకల్లోని డెజర్ట్ కౌంటర్లలో బక్లవానూ చేర్చడం స్టేటస్ సింబల్‌గా మారింది. పైగా యువత దీని రుచి చూడ్డానికి ఆసక్తి కనబరచడంతో స్టైలిష్ స్వీటుగానూ పేరొందింది.

## పిజ్జాను పోలిన కునాఫా

సేమ్యా అలంకరించిన మందపాటి పిజ్జాను పోలి ఉంటుంది కునాఫా. మిల్క్‌మెయిడ్, సేమ్యా, వెన్న, కొబ్బరి, చీజ్, మొక్కజొన్న పిండితో తయారుచేసే ఈ డిష్ పేరుతోనే కునాఫా స్టేషన్ అంటూ ప్రత్యేక దుకాణాలూ వెలుస్తున్నాయి. ఇవే కాదు, క్యారెట్‌కు వేయించిన నట్స్ కలిపి కొబ్బరిలో ముంచే సుతి మెత్తని సెజరి, గొట్టం కాజాను పోలిన టులుంబా, సేమ్యాతో చేసిన మిల్క్, కేక్ సంబాలి, బాదం ఎజ్మెసి ఇలా ఎన్నో రకాలు వస్తున్నాయి. మరి రుచి చూసేద్దామా...! ❑



# మంచి కాలం-కర్మఫలం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**భూమ్మీద** నివసించే ప్రతి జీవి మీదా సూర్యచంద్రులతో పాటు మిగిలిన గ్రహాలు నక్షత్రాల ఆకర్షణ ప్రభావం కచ్చితంగా ఉంటుందని చెబుతారు. గ్రహణ సమయంలో మీరు గమనించారో లేదో.. పక్షులూ, జంతువులూ విభిన్నంగా ప్రవర్తిస్తాయి. ఆ విధంగానే పౌర్ణమి, అమావాస్య సమయాల్లో సముద్రపు ఆటుపోట్లు మనకు తెలిసినవే. మానవుల్లో ప్రవృత్తి మారుతుంది. కొందరిలో శృంగార వాంఛలలో విపరీత ప్రభావాలు మనం గమనించదగినవే. ఎనభై నాలుగు లక్షల జీవరాసుల్లో మానవుడు కూడా సూర్యచంద్రుల ఆధారంగా సృష్టించబడ్డాడు. సూర్య, చంద్ర కాలమానాలను బట్టి, క్రమశిక్షణాయుతమైన జీవనగతి ఏర్పాటు చేయబడింది. శని గ్రహానికి ఇరవై తొమ్మిది సంవత్సరాలు పడుతుందనీ, చంద్రునిపై ఒకరోజు అంటే మన భూగోళ కాలమాన ప్రకారం ఇరవై ఎనిమిది రోజులు అనీ, సూర్యరశ్మి ప్రసరించే పగటి కాలం పధ్నాలుగు రోజులని చెబుతారు. ఇక మానవుడు చేసే ప్రతి పవిత్రమైన సమయాన్ని ఎంపిక చేసుకుంటూ ఉంటున్నాడు. ఈ ముహూర్తం అనేది ఖగోళ శాస్త్రాలనే బట్టి జ్యోతిషం అంటూ పిలవబడింది. ఏ శాస్త్రమైనా, మనిషికీ, సమాజానికీ ప్రయోజనం కలిగించాలి.

మన పూర్వం మహర్షులు ఆకాశంలోని నక్షత్ర రాశులనూ, ఖగోల గమనాలను కంటిచూపుతోనే చూడగలిగేవారట.



అలా చూసే వశిష్ఠుల వంటివారు ముహూర్తాలు నిర్ణయించారని మనం రామాయణం వంటి మహాకావ్యాల్లో గమనించాం. ఇక మరి జ్యోతిషం అనేది మానవుడికి ఒక మంచి ఆశాభావ మార్గాన్ని కల్పించేదని మాత్రమే తెలుసుకోవాలి.

సర్వ వాక్యాల సమాహారమే శాస్త్రంగా రూపుదిద్దుకుందని పెద్దలు చెబుతారు. శాస్త్రాలు చెప్పాలనుకునే వారికి కొన్ని అర్హతలు తప్పనిసరిగా వుండాలి. వారికి పాండిత్యమూ, గ్రహ నక్షత్ర పరిజ్ఞానం, వేదజ్ఞానం, సత్యసంధత, శ్రద్ధ, శుచి, శీలము, నిజాయితీ, వినయం, ధైర్యం కలిగివుండాలి. అత్యాశ పనికిరాదు, దురాశ కూడదు. ఆధ్యాత్మిక పరిణతి కలిగి వుండాలి. అలా కలిగినవారికే వాక్సుద్ధి లభిస్తుంది. అలాంటి వారయితేనే ఎదుటివారి మనోభావాలను గ్రహించి వారికి ధైర్యాన్ని ఇవ్వగలరు. ఇక్కడ మరో ముఖ్య విషయం వుంది. ప్రారబ్ధం అని ఒకటుంది, దాన్ని ఎవ్వరూ మార్చలేరు. దాని ప్రభావాన్ని తగ్గించుకోవాలంటే మంచి సంకలనపంతో ముందుకు సాగాల్సి వుంది. సృష్టికర్తయైన పరమాత్ముని తన్మయ భక్తితో కొలవాలి. అప్పుడే ఎలాంటి అవరోధాల తీవ్రత అయినా తగ్గే అవకాశం వుందని విజ్ఞులైనవారు చెబుతున్నారు. శాస్త్రాలనేవి ఏవి కూడా ఎవ్వరినీ భయపెట్టే ప్రసక్తే రాదు. ప్రకృతికి అనుగుణంగా, ఏ విధంగా మానవాళి నడుచుకోవాలో నేర్పుతోంది. కాలానుగుణంగా ఎలా ప్రవర్తించాలో సూచనప్రాయంగా తెలియచేస్తుంది. సర్వమానవాళి సంక్షేమమే లక్ష్యంగా మనిషి ఈ విశ్వంలో సంచరించేందుకు ఒక క్షేమకరమైన మార్గాన్ని సూచిస్తుంది.

మనం ఆలోచించి చూస్తే, పురాతన కాలంలోనే ఆధ్యాత్మిక దృక్పథంతోబాటు, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సముపార్జించుకున్న గొప్ప దేశం మనది. అన్ని శాస్త్రాలనూ పూర్తిగా అధ్యయనం గావించి, వాటి పట్ల పూర్తి అవగాహన కలిగినవారు మన పూర్వీకులు.

మానవుడు తనకు సుఖ జీవనం కోసం తాపత్రయ పడటం సమంజసమేగానీ, వారు తప్పనిసరిగా ఇతరులకు సాయం చేయాలనే విషయాన్ని మరిచిపోరాదు. ప్రేమ, భక్తి, వివేకం, వైరాగ్యం.. ఇవే భగవంతుడు కోరుకునేవి. భగవంతుడు దయామయుడు. ఎలాంటి చిక్కులనైనా ఇట్టే విడదీయగలడు. అందుకు దైవం పట్ల నమ్మకం వుండాలి.

చిక్కుల్లోనే మానవుడు ఎదుగుతాడు. మానవ జన్మలో భగవంతుడికైనా మరణం తథ్యం పుట్టినవారు గిట్టక మానరు. చావు గురించి చెప్పుకుంటుంటే మన మత గ్రంథాల్లో పుణ్యం, పాపం ప్రసక్తి తెస్తారు. మన కర్మలను బట్టి మన కష్టసుఖాలుగానీ, లేక ఆయుష్షుగానీ ఆధారపడి వుంటాయని తెలుస్తోంది. 'పోయినవారందరూ మంచోళ్లు' అన్న నానుడి కూడా ఎక్కువ ప్రచారంలో వుంది. అలాగే 'పాపీ చిరాయువు' అన్న మాటలు కూడా మనం వింటూనే వుంటాం. అయితే మనం బతికినన్ని రోజులూ ఎవ్వరినీ యాచించకుండా జీవించాలి. మనం సతీసావిత్రి కథ వినే వుంటాం. యముడితోనే తాను పట్టుబట్టి తన భర్తను కాపాడుకున్న వైనం విన్నాం. దైవమే మన పట్ల కరుణ చూపిన, ఏ విధమైన కీడూ మనకు కలుగదనీ, చివరకు మరణం కూడా ఆ మృత్యుంజయుడి దయతో దూరం కాగలదు. పరమాత్మ తల్చుకుంటే మన ఆత్మను కొంత కాలం ఈ శరీరంలో వుంచి, జీవంతో వుండేలా అనుగ్రహించగలడు. అందుకు జీవుడు, తాను భగవంతునిపై పూర్తి విశ్వాసం కలిగి, ధర్మ మార్గంలో, న్యాయంగా జీవిస్తూ, సర్వ శక్తివంతమైన భగవన్నామాలను ఉచ్చరించాలి. ❑

కథ

# వాన్య నవ్వింది

**దీపావళి,** అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు అంతా కలిశారు. పిల్లల ఆటపాటలతో సందడి సాగుతోంది. అద్విత రెండు ఏళ్లపాప. తన దగ్గర వున్న టెడ్డీబేర్ చూసి అది కావాలని తీసుకోబోయింది నాలుగేళ్ల వాన్య. అద్విత ఇవ్వలేదు. వాన్యకి వాళ్ల నాన్న ఇంకో బొమ్మ ఇచ్చాడు. గడసరి అద్విత దాన్ని కూడా లాక్కుని రెండు బొమ్మల్నీ పొదవి పట్టుకుంది ఎవరు లాక్కుంటారో అన్నట్లు. అద్విత చేష్టలకి నవ్వుకున్నారు అంతా.



కానీ వాన్యకి మాత్రం బోలెడు కోపం వచ్చింది. బుంగమూతి పెట్టి తమ గదిలోకి వెళ్లి మంచం మీద కూర్చుంది. తండ్రి బుజ్జగించబోతే మరింత అలిగింది. బుంగమూతిని ఇంకా బిగించింది. ఇంతలో అద్విత వచ్చి రెండు బొమ్మలూ వాన్యకి ఇచ్చింది. అమ్మో! పిల్లలెంత తెలివిగలవాళ్లు!! స్వాభిమానం అన్నది అంత చిన్నప్పటి నుంచి వస్తుందా!? వాన్య తన బొమ్మ మాత్రం తీసుకుంది. రెండోదాన్ని తోసేసింది. అది చూసిన నాన్న, వాన్య బుంగమూతి చూసి పకపకా నవ్వాడు. వాన్య మూతి బిగించినకొద్దీ ఇంకా ముద్దొచ్చి నవ్వాడు. ఇల్లంతా నవ్వులతో నిండిపోయింది. వాన్య బుంగమూతి ఎక్కువసేపు నిలవలేదు. అందరితోబాటు తనూ కిలకిలా నవ్వింది. తర్వాత వాన్య, అద్విత కలిసి ఆడుకున్నారు.

...

ఆ రోజు స్కూల్లో పిల్లలందరూ తమముందున్న పుస్తకాల్లో వున్న బొమ్మలకి రకరకాల రంగులు వేస్తున్నారు. ఎవరి క్రేయాన్స్ వారికున్నాయి. పిల్లలకిష్టమైన పని కదా..ఎక్కడబడితే అక్కడ రంగులు గీసెయ్యటం. అందుకే అంతా బుద్ధిగా, శ్రద్ధగా వేస్తున్నారు. కృష్ణ తన క్రేయాన్స్ బేగ్‌లోంచి తియ్యకుండా పక్కనే వున్న ఉమ క్రేయాన్స్ తీసుకుని వెయ్యసాగాడు. ఉమకి కోపం వచ్చి తనవాటిని లాక్కుంది. కృష్ణ తక్కువ తినలేదు. ఉమ ఒక క్రేయాన్ లాక్కుంటే ఆమె క్రేయాన్స్ లోంచి ఇంకోటి తీసుకుని గియ్యసాగాడు. ఉమ ఏం చెయ్యలేకపోయింది. కోపం వచ్చింది. వెంటనే ఏడుపొచ్చింది. చిన్న పిల్లకదా పెద్దగా ఏడవసాగింది. టీచర్ గబగబా వచ్చింది ఏమయిందంటూ. టీచర్‌కి కృష్ణని చూపిస్తూ ఇంకా పెద్దగా ఏడవసాగింది ఉమ. టీచర్ ఉమని ఏడవద్దు అని చెప్తూ కృష్ణని అసలు విషయం అడగసాగింది. కృష్ణా చిన్న పిల్లాడుకదా. తనవి కాకుండా పక్కవాళ్ల క్రేయాన్స్ ఎందుకు వాడాడో చెప్పలేదు. మౌనంగా చూస్తున్నాడు. టీచర్ ఇద్దరినీ తన ధోరణిలో తను అనునయిస్తూనే వుంది. ఎవరూ తగ్గటం లేదు.

ముందు బెంచీలో కూర్చున్న వాన్య వెనక్కి తిరిగి చూసింది. ఉమ బుంగమూతి పెట్టుకుని ఏడవడం, కృష్ణ బుంగమూతి పెట్టుకుని మాట్లాడకుండా కూర్చోవటం చూసి వాన్యకి నవ్వాగలేదు. తన బుంగమూతి చూసి నాన్న నవ్వితే అంతా నవ్వారు కదా. అంతే. పకపకా నవ్వసాగింది. టీచర్ నెమ్మదిగా వారించినా వినలేదు. పక్కమ్మాయికి వీరి బుంగమూతులు చూపిస్తూ ఇంకా నవ్వసాగింది. వాన్యతోబాటు పక్కమ్మాయి, ఆ పక్క, ఈ పక్క, వెనక, ముందు అంతా నవ్వసాగారు. ఆ నవ్వులకి కృష్ణ, ఉమల నవ్వులు కూడా తోడయ్యాయి. టీచర్ కూడా ఉత్సాహంగా, సంతోషంగా నవ్వింది నవ్వు మహత్యం తెలుసుకుంటూ..క్లాసు మొత్తం పసిపాపల నవ్వులు పువ్వులై స్నేహసౌరభాలు వెదజల్లాయి.

– పి.యస్.యమ్.లక్ష్మి

వార్త ఆదివారం

## బాలగేయం

### బడిపిల్లలం



పిల్లలం మేం
బడిపిల్లలం
ఆటపాటలతో
అల్లరి చేసినా
చదువు, హోంవర్క్
మరువం
టీచర్ పాఠాలు
శ్రద్ధగా వింటాం
స్నేహితులతో
ఆటలెన్నో, పాటలెన్నో
నేర్చుకున్నాం
ఇంటికొచ్చాక
అమ్మ అడిగే
బడి వార్తలన్ని చెప్పేస్తాం
నాన్న తెచ్చే కమ్మని స్వీట్లు
లాగేస్తాం
పరీక్షలన్ని బాగా రాస్తాం
మంచి మార్కులు
తెచ్చుకుంటాం
సెల్‌ఫోన్లతో
టైమ్ వేస్ట్ చేయం
అది మాకొద్దేవద్దు.

**- యాతు**

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.భాస్కర్,** విజయవాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జీర్ణక్రియకు లాలాజలం ఏవిధంగా ఉపకరిస్తుంది?



**జవాబు: భాస్కర్!** మన నోటిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. ఈ గ్రంథులను పెరోటిడ్, సబ్ లింగ్యుయల్, సబ్ మండిబ్యులర్‌గా వ్యవహరిస్తారు. ఈ గ్రంథుల నుంచే లాలాజలం ఊరుతూ ఉంటుంది.

పెరోటిడ్ గ్రంథులు చెవి-దవడ ఎముకల మధ్యలో; సబ్ లింగ్యుయల్ గ్రంథులు నాలుక అడుగు భాగంలో బాగా చిన్నగా; సబ్ మండిబ్యులర్ గ్రంథులు నాలుక-దవడ ఎముకల మధ్యన ఉంటాయి. లాలాజలం నీళ్ల మాదిరిగా జిగటగా ఉండి, ఏ రంగూ లేకుండా వుంటుంది. ఇందులో 98 శాతం నీరు, 2 శాతం ఎంజైమ్ ఉంటాయి. ఈ ఎంజైమ్స్‌లో టైలిన్, లిసోజిమ్ అనేవి వుండి, నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించే బాక్టీరియాను అంతమొందిస్తాయి. ఆహారాన్ని బాగా నములుతుంటే నోటిలో లాలాజలం బాగా ఎక్కువగా ఊరుతుంటుంది. అన్ననాళం గుండా ఆహార పదార్థాలు కడుపులోకి సునాయాసంగా వెళ్లడానికి సహాయపడుతుంది. అంతేకాదు, నోటిని ఎల్లవేళలా తడిగా ఉంచుతుంది. ఆహారాన్ని ద్రవ పదార్థంగా మార్చడం ద్వారా జీర్ణశక్తి పెంపొందడానికి ఎక్కువ అవకాశం ఏర్పడుతుంది. ఆహారాన్ని చూడగానే లేదా వాటి వాసనలను ముక్కు పీల్చినా శరీరంలోని ఇంద్రియాలు (కళ్లు, ముక్కు) లాలాజల గ్రంథులకు సందేశాన్ని అందిస్తాయి. సందేశాన్ని అందుకున్న వెంటనే లాలాజల గ్రంథులు లాలాజలాన్ని స్రవిస్తాయి. లాలాజలం నోటిలోని ఆమ్ల స్థాయిని తగిన విధంగా ఉంచుతుంది. శరీరంలోని ఎంజైమ్‌లను బాగా పని చేయిస్తుంది. లాలాజలాన్ని ఏ విధంగానూ వృధా చేయకూడదు.

# ధనుర్మాసం ప్రత్యేకత



డాక్టర్ ఓరుగంటి సరస్వతి

విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. సాత్వికమైన ఆరాధనలకు ఎంతో ప్రీతిపాత్రమైన ఈ ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది. కనుక సత్వగుణ ప్రధానుడైన విష్ణువును ఈనెలలో ఆరాధిస్తారు. ధనుర్మాసం అంటే దివ్యప్రార్థనలకు (పూజలకు) అనువైన మాసం అని అర్థం. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన సమయమే ధనుస్సంక్రమణ. ధనస్సులో సూర్యుడుండే కాలమును ధనుర్మాసము అని అంటారు. ఉత్తరాయణం రాత్రి, దక్షిణాయనం పగలుగా, సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశించుట కర్కాటక సంక్రమణంగా పరిగణిస్తారు. అక్కడి నుండి దక్షిణాయనం ప్రారంభం. అంటే ఇది రాత్రికాలం, మకరరాశిలో ప్రవేశించు సమయం మకరసంక్రమణం. ఇక్కడి నుండి ఉత్తరాయణం. అంటే పగలుగా భావిస్తారు. ఇలా అనుకున్నప్పుడు దక్షిణాయమునకు, చివర, ఉత్తరాయణమునకు ముందుండేదీ ధనుర్మాసం. ఈ మాసం ప్రాతఃకాలమునకు ఎంతటి పవిత్రతను కలిగి ఉంటే, అలాంటి పవిత్రతను పొందుపరచుకున్న మాసం. దేవాలయాలలో ఆగమశాస్త్రం, కైంకర్యాలలో, స్థానిక ఆచార సంప్రదాయాలలో, ఇతర సంప్రదాయాలలో కలిసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. నిజానికి తిరుప్పావై పఠనం, సేవ, అండాళ్‌పూజ, గోదాదేవి కళ్యాణం మొదలైనవన్నీ ద్రావిడదేశ సంప్రదాయాలుగా పెద్దలు చెప్తుంటారు. ధనుర్మాసకాలంలో తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠనం చేయడం విశేషం. విష్ణు ఆలయాల్లో ఉదయం అర్చనలు, నివేదనలు చేసి ఆ ప్రసాదాలను పిల్లలకు పంచుతారు. అలా పంచడాన్ని బాలభాగం అంటారు.

సూర్యుడు ధనస్సు నుండి మకరరాశిలోకి ప్రవేశించేవరకు అనగా, భోగివరకు ధనుర్మాసం కొనసాగుతుంది. ధనుర్మాసం ఉభయసంధ్యలలో ఇంటిని శుభ్రం చేసి, దీపారాధన చేయడం వలన లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని, దారిద్ర్యం తొలగిపోయి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయనే నమ్మకం కూడా. అలాగే ఈ ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీముహూర్తం లాంటిదనే అభిప్రాయం కూడా పెద్దల ద్వారా తెలుస్తుంది. ఈ మకర, కర్కాటక సంక్రాంతులలో స్నాన,దాన, హోమ, వ్రత, పూజలు చేయడం ఎంతో పుణ్యం అని కూడా ప్రతీతి. ఈనెలరోజులు విష్ణు ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. మార్గశిర పౌర్ణమి తర్వాత పాడ్యమి నుండి వైష్ణవులు ధనుర్మాస వ్రతానికి శ్రీకారం చుడతారు. గోదాదేవి మార్గశిరవ్రతం పేరుతో ధనుర్మాసంలో వ్రతాన్ని చేపట్టి నారాయణున్ని కొలిచింది. ధనుస్సంక్రమణ రోజున నదీస్నానాలు, పూజలు, జపాలు చేయడం శ్రేష్టం. వైష్ణవ, సూర్య ఆలయాలను కూడా దర్శించడం శుభప్రదం.

ధనుర్మాసంలో నెలరోజులు బ్రాహ్మీముహుర్తంలో ఎవరైతే తిరుప్పావైని పారాయణం చేస్తారో వారికి దైవానుగ్రహం కలుగుతుందని శాస్త్రాలు చెపుతున్నాయి. 'తిరు' అనగా పవిత్రం, శ్రీకరం, శుభప్రదమైన అనీ, 'ప్పావై' అనగా 'వ్రతం' అని అర్థాలు ఉన్నాయి. అనగా 'తిరుప్పావై' అంటే 'పవిత్రమైన వ్రతమని' అర్థం. వేదాలు, ఉపనిషత్తులసారమే. 'తిరుప్పావై' అని మన హిందూ పురాణాలు సూచిస్తున్నాయి. ఈ మాసంలో శ్రీమహావిష్ణువుని మధుసూదనుడు అనే పేరుతో పూజించడం వలన మనకున్నటువంటి సర్వపాపాలు నశిస్తాయని చెప్తుంటారు. తిరుప్పావై చదువుతున్నటువంటి మొదటి 15 రోజులు చక్కెరపొంగలి లేదా పులగం, నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత 15 రోజులు దద్ధోజనం నివేదించాలి. అంతేకాకుండా పెళ్లిడుకొచ్చిన అమ్మాయిలు, తమ ఇంటిముందు పిండితో ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో పూజ చేయడం వలన కోరిన వరుడు లభిస్తాడు అనే నమ్మకం కూడా ఉంది. గోదాదేవి మార్గశిర వ్రతం పేరుతో విష్ణువుని ధనుర్మాసం అంతా పూజించింది. రోజూ ఒక కీర్తనతో (పాశురం)తో స్వామి వారిని కీర్తిస్తూ, ఆవిధంగా 30 రోజులు 30 పాశురాలతో స్వామివారిని ఆరాధించింది.



అంతేకాకుండా ఈ మాసంలో రోజూ కృష్ణుడికి తులసీ మాల సమర్పించే స్త్రీలకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని మరో నమ్మకం. ధనుర్మాసం వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారదమహర్షికి వివరించినట్ల పురాణకథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్యపురాణాలు, భాగవతం నారాయణ సంహితలలో కన్పిస్తాయి.

పెళ్లికాని వారు తిరుప్పావై పారాయణం చేయడం వలన వారి కోరికలు ఫలించి, శుభాలు కలుగుతాయి అన్న విషయాల్ని గోదాదేవి కథను చూస్తే అర్థమవుతుంది. గోదాదేవి శ్రీరంగనాథుని కొరకు చేసిన ధనుర్మాసవ్రతాన్ని కొంతవరకు పరికించి చూడగా..



విష్ణుచిత్తునికి పిల్లలు లేరు. తులసితోటలో అతనికి ఒక ఆడశిశువు కన్పిస్తుంది. అందం, దివ్యతేజస్సు ని చూసి, ఆ కృష్ణుడే పిల్లలు లేని తనకు కూతురుగా అనుగ్రహించాడని సంతోషించి, ఇంటికి తీసుకొనిపోయి గోదాదేవి అని పేరు పెట్టుకుంటాడు. వింగడమైన మొక్క వన వీధిగ్రనుంగొనె నీడ సున్నపన్ రంగుటరంగు పచ్చల మరందులు పోంలెదమ్మి వావికం జెంగట నుల్లసిల్ల తులసీవన సీమ శుభాంగి నొక్క బా లంగురు విందళం దళదళ ప్రతి నూంత్రికలో దరాధరన్ పచ్చలరాల అరుగు, వెలిదమ్మి బావి చెంత తులసీ. తోట ఇవన్నీ ఆ శిశువు దివ్యమైన రూపాన్ని వర్ణించే సందర్భాలు. సీతవలె ఆమె కూడా అయోనిజ.

శ్రీవిల్లిపుత్తూరనే పట్టణం ఉన్నది. ఆ నగరం చుట్టూ అందమైన ఉద్యానవనాలున్నాయి. అందులో కోకిలలు, చిలుకలు, పాడుతూ ఉంటే అవి నగరంలోని ఇండ్ల చూరుల్లో అలంకారార్థం అమర్చిన ఇంద్రనీలములు, పచ్చలతో చేసిన పికశురాలు పాడితే ప్రతిధ్వనులులాగా ఉన్నాయి. ప్రస్తుతం మధురానగరానికి 70,80 కిలోమీటర్ల దూరంలో శ్రీ విల్లిపుత్తూరు ఉన్నది అక్కడే గోదాదేవి, ఆమెను పెంచిన తండ్రి పెరియాళ్వారు పుట్టి పెరిగారు. గోదాదేవి యుక్త వయసు రాగానే ఆమెలోని సహజమైన మార్పుని కవి చాలా చక్కగా వర్ణించారు. గోదాదేవి తండ్రి విష్ణుచిత్తుడు ధనవంతుడైన తొలిరోజుల్లో స్వామివారికి పూలదండలను అల్లి, పూలబుట్ట తీసుకొనిపోయి సమర్పించేవాడు. విష్ణుపురాణాలను తన శిష్యులకు వివరిస్తూ ఉండేవాడు. ఎంతో ఐశ్వర్యం వచ్చినా తన వృత్తిని విడనాడకుండా చెంగలువ దండలు కడుతూ, ఆ కట్టిన దండలను పూలబుట్టలో పెట్టి గుడికిపోయి స్వామివారికి అర్పించడం విష్ణుచిత్తులవారి పనుల్లో ఒకభాగం. అలా కట్టిన దండలను కూతురు (గోదాదేవి) తలదువ్వుకొని ఎడమ పక్కన ఎత్తుగా ముడివేసిన కొప్పు (ఎద్దు మూపురంలాగా ఒరిగినట్లుండే) కింద ఆ దండను అలంకరించుకొని కొర్కెతీరేటట్లుగా, బావి నీళ్లలో తన రూపం చూసుకొని తిరిగి ఆ దండను పూలబుట్టలో పెట్టేది. విష్ణుచిత్తుడు ఇలా పూలదండను అల్లడం, బుట్టలో పెట్టడం, గోదాదేవి పసుపుతో నలుగుపెట్టుకొని స్నానం చేసి, కుంకుమ, కర్పూరపు బొట్టు దిద్దుకొని, తండ్రి కట్టే పూలదండలు కొప్పులో ముడుచుకొని తీసివేసి నిట్టూర్పులు విడుస్తూ బుట్టలో వేసేది. గోదాదేవి శ్రీరంగనాధుడిని తలచుకుంటూ ఒకరోజు రాత్రి ఏడుస్తూ (విరహంతో) ఆ కన్నీరు కొనగోళ్లతో చిమ్మింది. అది దీపం మీదపడి చిటచిటమన్నది. ఆధ్వనికి మేల్కొన్నారు చెలికత్తెలు. గోదాదేవి ఒంటిమీద ఉన్న విరహానికి ముత్యాల దండ నల్లగా మారి, పగిలి పొరలు వచ్చాయి. స్నానం చేసేవేళ శరీరంలోకి వేడినీటి చల్లదనానికి పొంగి పక్కన ఉన్న చెలికత్తె మెడలోని హారాన్ని సున్నం చేసింది. అలాంటి విరహవేదనలో ఉన్న గోదాదేవి ఈ కలివేళ జన్మించుటయే పాపం అనుకుంటుంది. విరహవేదనలో మాడిపోతూ, బతుకుతూ తండ్రి తీసుకొచ్చే వరున్ని చేసుకోవడం ఇష్టం ఉండక, తన శరీరాన్ని యోగశక్తితో అంతం చేసుకుంటే, తన(శ్రీరంగనాథుని) స్వామి పాదాల చెంతకు చేరి సేవించుకోవచ్చునని అనుకుంటుంది. సహజంగా ఆడపిల్లలు ఇష్టంలేని పెళ్ళి చాలా కష్టంగా భావిస్తారు కదా! అలాగే గోదాదేవి కూడా ఆవిధంగా ఆలోచించి ఉండవచ్చు. విష్ణుచిత్తుడు ఒకరోజు హరి చరితను చెప్తూ 108 తిరుపతుల, ఆవిర్భావ అవతారములను వివరించాడు. శ్రీరంగం గొప్పక్షేత్రం. శ్రీరంగపతియే సాక్షాత్ విష్ణువని చెప్తే, ఆమె(గోదాదేవి) ఆ శ్రీరంగపతిపై మనసు నిలుపుకుం టుంది. గోదాదేవి ఎల్లవేళలా ఆ శ్రీరంగనాధుడినే(విష్ణువునే) తలచుకుంటూ ఉండేది. భగవంతుని అంటే ఆ శ్రీరంగనాథున్ని భర్తగా పొందాలంటే ఏమి చేయాలని ప్రశ్నిస్తుంది. అతడు గోపికల వలె ధనుర్మాసం వ్రతం చెయ్యమని చెప్తాడు. గోదాదేవి ధనుర్మాసంలో వేకువజామునే లేచి నిత్యం విష్ణువుని పూజిస్తూ, ఆ స్వామివారిని సేవించే అనుభూతిని కలిగి ఆ భావాలన్నింటిని పాశురం రూపంలో రచించింది. అలా 30 రోజుల్లో 30 ఆ మాసంలో పాశురాలు రచించింది. వాటినన్నింటిని విష్ణువుకు అంకితం చేసింది. ఆమె భక్తికి, వ్రతానికి పూజకి మెచ్చిన విష్ణువు ప్రత్యక్షమై శ్రీరంగం రమ్మని అంటాడు. గోదాదేవి ఈ విషయాన్ని తండ్రితో చెప్పడంతో ఆయన ఆమెను తీసుకొని శ్రీరంగం చేరుకుంటాడు. రంగనాథస్వామితో వివాహం జరిగినంతనే గోదాదేవి ఆయన(స్వామి) పాదాల చెంతమోకరిల్లి వారిలో అంతర్లీనమైపోతుంది. మరో కథనంగా గోదాదేవి శ్రీరంగపట్నానికి తన చెలికత్తెస్వామివారికి వర్తమానం పంపింది. స్వామి గోదాదేవి కలలో కనిపించి ఆమె విరహబాధను తీర్చాడు. ఆ స్థితిలో వున్నగోదాదేవిని అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకొని శ్రీరంగమునకు గోదాసమేతుడై వెళ్లాడని కథనం. ధనుర్మాసంలో శుభకార్యాలు జరిపించరు. రవి ధనుస్సు రాశిలోకి ప్రవేశించి, మకరంలోకి వెళ్లే సమయమే ధనుర్మాసం. నారాయణుని శ్రీహరి గాను, లక్ష్మీపతిగాను, ఆపద్బాంధవునిగాను కొందరు శతకవులు కొనియాడి శతకాలు రాశారు. వీటిలో నృసింహ, రామ, కృష్ణ అవతారాలు ఆ క్షేత్రాలలో వెలసిన దైవాలను గురించి వెలువడిన శతకాలే ఎక్కువ ఆంధ్రమహాభాగవతకర్త పోతనగారి నారాయణ శతకంలోని ప్రతి పద్యమునందు పోతన ఆర్తహృదయం వ్యక్తమ వుతున్నది. ఈ క్రింది పద్యం చూస్తే ఆ విషయం అర్థమవుతుంది..

సర్వంభున్ వసించు నీ తనువునే సర్వంబునందుండుగా
సర్వాత్మా! వసించు దీవని మదినేసార్థంబుగా జూచి యా
గీర్వాణాదులు వాసుదేవుడునుచునే గీర్తించురే ప్రొద్దునా శీర్వాదంబు
భవన్మహా మహిహా లక్ష్మీనాథ, నారాయణ! ❑

కథ

ఎన్.త్రినాథరావు

# ఎవరో వస్తారని..

**"బాబూ" అందామె దీనంగా.**

**ఆమెను చూసి అతడు ముఖం చిట్లించాడు. "మళ్లీ దాపురించావా" అన్నట్టు మొహం పెట్టాడు. "చెప్పు" అన్నా డు అనాసక్తంగా.**

**ఆమె తటపటాయించింది. ఆ బాబుకి అసలే కోపమెక్కువ. తను నోరు తెరవగానే తన మీద గయ్యిమంటాడు. చిరాకు పడిపోతాడు. ఇప్పటికి తన పైన ఎన్నో చిరాకులు పరాకులు అయ్యాయి. అవన్నీ తనకు అలవాటు అయిపోయాయి. మొదట్లో తను చాలా బాధపడేది. రాను రాను అలవాటు అయిపోయింది. పోనీలే తనని కసురుకుంటే కసురుకున్నాడు.. తిడితే తిట్టాడు. తను పట్టించుకోకూడదు. తన పని అయిపోతే అంతే చాలు.. అనుకుందామె.**

"చెప్పమ్మా" అంటూ అతడు గద్దించాడు.. జింకపిల్లని చూసి సింహం గర్జించినట్టుగా. ఆమె ఒక్కసారి తుళ్లిపడింది. ఆలోచనల్లోంచి తేరుకొని మెల్లగా నోరు విప్పింది. అంతే. తను అనుకున్నట్టుగా అతడు తాసుపాములా కస్సు మన్నాడు.

"ఏమ్మా, నీకు పనీ పాటా లేదా? తెల తెలవారగానే వచ్చేస్తావు. నా బుర్ర తింటావు. నీకు ఎన్ని సార్లు చెప్పాను. ఇలా రోజూ వచ్చి నా మెదడు తింటే పనులు కావని".

"మరేం చేయను బాబూ" అందామె మరింత దీనంగా.

"నువ్వొక అర్జీ రాసి నీతో పాటు అందరి సంతకాలు పెట్టించుకుని, ఆ కాగితం పట్టుకొని రా. అప్పుడాలోచిస్తాను" అంటూ ధడేల్మని ఆమె మొహం పైనే తలుపు వేసేశాడు ఆ అధికారి.

ఆమె మనసు చివుక్కుమంది. చెప్పుతో మొహం మీద కొట్టినట్టు బాధ పడింది.

"సరే బాబూ" అంటూ ఆమె బయటికి నడిచింది.

ఆమె కాళ్లకి చెప్పులు లేవు. పైన సూర్యుడు ఎవరి మీదో కోపాన్ని తన మీద చూపిస్తున్నట్టు భగ భగా మండిపోతున్నాడు. నడుచుకుంటూ అక్కడికి చేరింది. అక్కడి నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. పైన ఎండకి మాడు మాడుతుంటే చెప్పుల్లేని ఆమె కాళ్లు బొబ్బలెక్కుతున్నాయి. అయినాసరే.. ఆమె బాధను దిగమింగుకుంటూ నడవసాగింది. తను ఎన్ని ఇబ్బందులు పడినా, ఎన్ని కష్టాలు పడినా తను అనుకున్న పని అయిపోతే అంతేచాలు.. అనుకుందామె.

అలాంటప్పుడే ఆమెకు తను పుట్టిన ఊరు గుర్తొస్తూ ఉంటుంది. ఆ ఊరు తనకి ఎంత బాగుండేది..! తన బాల్యమంతా అక్కడే గడిచింది. అక్కడే తను పెద్దదయింది. ఒక్క ఇబ్బంది కూడా లేని ఊరది. అన్ని సౌకర్యాలు ఉన్న ఆ ఊరంటే తనకెంతో ఇష్టం. తను చిన్నప్పటి నుంచీ ఎన్నో కష్టాలు పడింది. తనకి పెళ్లయి తనీ ఊరు వచ్చాక తన కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.

నడుస్తుండగా కంకర రాయి తన పాదంలోకి బలంగా గుచ్చుకొని చురుక్కుమంది ఆమెకి. చివ్వుమని చిమ్మింది రక్తం. అయినా ఆమె ఆ గాయాన్ని లెక్క చేయలేదు. నడుస్తూనే ఉంది. కాసేపటికి ఆ గాయంలోకి ఎర్రటి మట్టి దూరిపోయి రక్తం స్రవించడం ఆగింది. నడుస్తూనే, ఆయాసపడుతూనే తన గుడిసెకి చేరుకుందామె.

"జాజీ, వచ్చేసావా" అన్నాడు ఆమె భర్త.

ఆమె మెల్లగా మూలిగింది. అప్పటికే తగిలిన గాయం పైనే మరో రాయి గుచ్చుకొని ఆమె ప్రాణం జివ్వుమంది. విలవిల్లాడిపోయింది. ఆమె నల్లని పాదం నుండి ఎర్రని రక్తం కారటం చూసి కంగారు పడిపోలేదు ఆమె భర్త. ఇలాంటి దెబ్బలు, గాయాలు తమకి కొత్త కావు. రోజూ ఇలాంటివి ఎన్నో తగులుతుంటాయి, జీవితంలో తగిలే ఎదురుదెబ్బల్లా. అన్నిటినీ ఓర్చుకుంటూ, బాధలు సహిస్తూ జీవనం గడుపుతున్నారు అక్కడ గ్రామస్తులు.

జాజి కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చింది. అతడు ఆ పక్కనే ఉన్న ఓ చెట్టుకొమ్మ ఆకులు తెంపి, పసరు తీసి ఆమె గాయంపై పూశాడు. చల్లగా తగిలేసరికి జాజి ప్రాణం హాయిగా అనిపించి అలాగే మట్టి నేలపై పడుకుండిపోయింది.

"పిల్లలేరి?" అడిగింది నీరసంగా.

"పడుకున్నారు" నువ్వు కూడు తిని పడుకో. నేను పనికి పోతున్న. రాత్రికి వస్త. అన్నట్టు నువ్వెళ్లిన పనేమైంది?" అడిగాడు ఆమె భర్త.

జాజి విరక్తిగా నవ్వి "ఎప్పట్లా ఆ బాబు మళ్లీ నన్ను కసురుకున్నాడు. అర్జీ రాయించి, అందరితో సంతకాలు చేయించి కాయితాలు తెమ్మన్నాడు. అది పైకి పంపుతాడట" అంది జాజి నిస్స త్తువుగా.



"నీ పిచ్చిగానీ, ఇంకా నువ్వా బాబుని నమ్ముతున్నావా? ఇప్పటికి ఎన్ని ప్రదక్షిణాలు చేసుంటావు. లెక్కే లేదు. రేపంటాడు, మాపంటాడు, కాయితం అంటాడు. మరొకటి అంటాడు. నేను పట్టుకెళ్లే కాయగూరలు, తేనె, జీడిపప్పులు ఎప్పటికప్పుడు మెక్కుతూనే ఉంటాడు.

మన పని చెప్పగానే తారాజువ్వలా అంతెత్తున లేస్తాడు. నువ్వింకా ఆ బాబుని నమ్ముతున్నావు. ఆ బాబు వలన నీ పని కాదు. ఆ బాబు కాదు, మనకు ఏ బాబూ సహాయం చేయడు. ఎందుకు మనకీ బాధలు? నువ్వూ అందరిలా ఉండు. ఎవరికీ లేని బాధ మనకెందుకు చెప్పు? అందరితో పాటూ మనమూనూ. ఉంటే ఇక్కడ ఉందాం. లేదా మరో చోటుకి పోదాం" అన్నాడు ఆమె భర్త నిరాశగా. అప్పటికే నిద్రలోకి జారుకుంది జాజి.

"బాబూ, నువ్వు చెప్పినట్టుగానే కాయితం రాయించి అందరితో సంతకాలు చేయించి తెచ్చిన" అంటూ అర్జీ అందించింది జాజి. దాన్ని అంటరాని వస్తువును తాకినట్టు చిరాగ్గా తీసుకుని చదివాడు ఆ అధికారి. ఆ అర్జీలో రాసిన విషయం కింద చూసాడు. మళ్లీ గయ్‌మన్నాడు అతడు.

"ఇందులో సంతకాలు ఏవీ?" అన్నాడు కస్సుమంటూ.

జాజి చిన్నగా నవ్వింది.

"మీకు తెల్వదా బాబూ? మా గ్రామంలో కాస్తో కూస్తో చదువుకున్నదాన్ని నేనొక్కదాన్నే. అందుకే నేనే అర్జీ రాసి సంతకం పెట్టిన. తక్కినవాళ్లు చదువులేనివాళ్లు. అందుకే అందరితో నిశానీలు వేయించిన. ఈసారయినా నా పని అయ్యేట్టు సూడు సామీ. సచ్చి నీ కడుపున పుడత. నీ కాల్ మొక్తా బాంచన్" అంది జాజి.

"సర్లే. కాయితం ఇచ్చావుగా.. వెళ్లు. దీన్ని పైకి పంపుతా. పనయితే నీకు కబురెడతా. నీ మొగుడికి చెప్పు.... వచ్చే నెల్లో నా కూతురి పెళ్లి ఉంది. జీడిపప్పులు, బాదంపప్పులు, తేనె తెమ్మని చెప్పు" అంటూ మళ్లీ విసుగ్గా కిటికీ తలుపేసేశాడు అధికారి.

ఆ అధికారి కోరినవన్నీ పట్టుకెళ్లాడు జాజి భర్త. కొన్ని రోజులు గడిచాయి.

జాజి కాళ్లు అరిగేటట్టు ఆ అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉంది. కాళ్లకు చెప్పులుంటే అవి అరిగిపోయేవే, కానీ ఆమె అదృష్టంకొద్దీ ఆమె కాళ్లకి చెప్పులు కూడా లేవు. జాజి జీవితం రెక్కాడితేగానీ డొక్కాడదు. ఆమె తన భర్తతో కలిసి కూలిపనులు చేస్తుంది. మధ్య మధ్యలో తను అర్జీ ఇచ్చిన కార్యాలయానికి వెళ్తూనే ఉంది. అడుగుతూనే ఉంది. అర్థిస్తూనే ఉంది. కానీ ఆమె తలపెట్టిన కార్యం మాత్రం కావటం లేదు.

ఆ గ్రామంలో సౌకర్యాలు అర కొరగా ఉన్నా, అక్కడున్న కుటుంబాలు పిల్లలతో అలాగే బాధలు పడుతున్నారు. బడికి, సంతకి వెళ్లాలన్నా, తమ గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్నవారు, గర్భిణిలు ఆసుపత్రికి వెళ్లాలన్నా ఎంతో కష్టపడుతూ వెళ్లాలి, కష్టపడుతూ రావాలి. ఆ బాధలు చూసి జాజి మనసు వికలమయ్యేది. తను పెళ్లి చేసికొని ఆ గ్రామం వచ్చిన కొత్తలో అక్కడ ఎన్నో కుటుంబాలు ఉండేవి. తను చాలా సంతోషించింది. అక్కడ సౌకర్యాలు లేక తనకీ మొదట్లో చాలా బాధనిపించేది. కానీ రాను రాను తను అలవాటు చేసుకుంది.

కానీ అక్కడ ఉండలేక కొన్ని కుటుంబాలు ఆ గ్రామం విడిచి వెళ్లిపోయాయి. అదే తనకు చాలా బాధగా ఉంది. ఇక పది కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఈరోజో రేపో ఈ గ్రామం విడిచి వెళ్లిపోతాయి. తను కూడా తన కుటుంబంతో కలిసి ఆ గ్రామం వదిలేద్దాం అనుకుంది జాజి. కానీ ఆమెకు మనస్కరించటం లేదు. ఆ గ్రామం అంటే తనకెంతో ఇష్టం. చేయటానికి కూలిపనులు దొరుకుతాయి? అక్కడే తనకి ఇద్దరు పిల్లలు పుట్టారు. అన్నీ బాగున్నాయి. కానీ అదొక్కటే సరిగ్గా లేదు. దానికోసం తను కాళ్లరిగేట్టు ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉంది. కానీ అధికారులు అదిగో.. ఇదిగో... అంటున్నారు. అక్కడ నుంచి జనం తరలిపోతున్నా, తన గోడు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అదే తనని బాధిస్తుంది. ఆ పనులు జరిగిన తర్వాత సమస్య ఉండదని, ఊరి నుంచి వెళ్లిపోవాల్సిన అవసరం లేదని ఆమె భావించింది. ఆ గ్రామం కోసం తనే ఏదైనా చేద్దామనుకుంది.

అలా ఆలోచిస్తుండగా ఆమెకు ఓ ఆలోచన వచ్చింది. దానిని తన భర్తతో చెప్పింది. అతడు కూడా సంతోషించాడు. తన భార్య కళ్లల్లో మెరుపు చూడాలనుకున్నాడు.

"అలాగే చేద్దాం.. నీ ఇష్టం" అన్నాడు. దాంతో ఆ గ్రామంలో పనులు మొదలయ్యాయి.

**"సర్లే. కాయితం ఇచ్చావుగా.. వెళ్లు. దీన్ని పైకి పంపుతా. పనయితే నీకు కబురెడతా. నీ మొగుడికి చెప్పు. వచ్చే నెల్లో నా కూతురి పెళ్లి ఉంది. జీడిపప్పులు, బాదంపప్పులు, తేనె తెమ్మని చెప్పు" అంటూ మళ్లీ విసుగ్గా కిటికీ తలుపేసేశాడు ఆ అధికారి.**

కొన్ని రోజులకి ఆ పని పూర్తయింది. ఆ గ్రామంలో మిగిలిన కుటుంబాలు కూడా చేయి చేయి కలిపారు. గ్రామస్తులు అనుకున్నది సాధించారు.

దాంతో ఆ గ్రామానికున్న సమస్య తీరిపోయింది. జాజి కళ్లల్లో ఆనందం!

విషయం తెలిసి అధికారులే ఆశ్చర్యపోయారు. ఆమె చేసిన ఆ గొప్ప పనిని పొగుడుతూ ఎవరో ఆమె ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి కాస్తా వైరల్ అయ్యాయి. ఒక నిరుపేద మహిళ ఇప్పుడు సెలబ్రిటీ అయిపోయింది. ఎంతో మంది ఆమెను చూడటానికి ఆమె ఇంటి ముందు క్యూలు కట్టారు. మీడియా కెమెరాలతో, మైకులతో అక్కడ దిగిపోయింది. ఆమె గొప్పతనం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది.

ఆ రోజు ప్రారంభోత్సవం జరిగింది.. సభ ఏర్పాటు అయింది. కొంతమంది పెద్దలు ఆమె గురించి గొప్పగా మాట్లాడేరు. తర్వాత ఆమె మాట్లాడింది.

"అందరికీ నమస్కారం. నేను పెద్దగా చదువుకోలేదు. మా గ్రామంలో సౌకర్యాలు లేక అర కొరగా ఉన్నా ఇక్కడ నివసిస్తున్న పదిహేను కుటుంబాలు బాధలు పడుతూ ఎలాగో జీవనం సాగిస్తుండేవి. మేమున్న గుడిసెలు అందరి ఇళ్లల్లా కిందన లేవు. కొండ మీదున్నాయి. మా ఇళ్లకి వెళ్లాలంటే సరైన రహదారి లేదు. రాత్రయితే మరీ కష్టం. పాములు, తేళ్లు తిరుగుతుంటాయి. ఉన్న చిన్న దారి కాస్తా అంతా గుంతలు, గోతులు, ముళ్లు, పొదలతో ఉండేది.

మాకు ఏం కావాలన్నా కొండ కిందికి రావాలి. కొండ పైకి రోడ్ కోసం నేను ఎన్నో సార్లు అధికార్లకు మొర పెట్టుకున్నాను. అర్జీలు ఇచ్చాను. వాళ్ల చుట్టూ నా కాళ్లు అరిగేటట్లు తిరిగాను. కానీ పని కాలేదు. సొంత ఇల్లు లేక కొండపైన గూళ్లు కట్టుకున్నాం. పైకి రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో చాలా మంది ఈ గ్రామం విడిచి వెళ్లిపోయారు. అది చూసి నా మనసు చలించిపోయింది.

**(తరువాయి 27వ పేజీలో...)**

# లోపాలు

**యామిజాల జగదీశ్**

**"నా కన్నా యోగ్యుడు, మంచోడు ఇంకొకడు ఈ లోకంలోనే లేడండి" అన్నాడొకడు.**

**అయితే అతనలా చెప్పడంతోనే నా మిత్రుడు ఎలాంటి నిర్ణయానికి వచ్చాడో తెలుసా..**

"అతనికన్నా అయోగ్యుడు, చెడ్డోడు ఇంకొకడు ఈ భూమ్మీద ఉండడని" అనుకున్నాడట.

మనిషికి ఉన్న పెద్ద లోపం.. తన దగ్గరున్న లోపం.. అది అతనికి తెలియకపోవడం. కానీ అతనికి ఎదుటి వారిలో లోపాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తుంటాయి.

అనగనగా ఓ ఒంటె ఒకరోజు ఓ కొంగను చూసి అడిగింది. అదేం ప్రశ్నో తెలుసా..

"నీ మెడ ఎందుకు వంపు తిరిగి ఉందని?"

తీరా ఒంటె తనకున్న వంపు శరీర నిర్మాణాన్ని మరచి కొంగనలా అడిగి హేళనగా నవ్విందట.

ఇప్పుడు మనలో చాలా మంది స్వభావం ఇలానే ఉంది.

నిజానికి ఈ లోకంలో లోటుపాట్లు లేని మనిషంటూ లేడు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక లోపం తప్పకుండా ఉంటుంది. కానీ అది వారికి తెలీదు. తెలిసినా తెలియనట్టే ఎదుటి వారిలో ఏదో ఒక లోపాన్ని చూసి హేళనగా నవ్వుతారు. మనలో ఉన్న లోపాన్ని మనం ముందుగా అర్థం చేసుకోవాలి.

ఓ ఊళ్లో ఓ విక్రయ కేంద్రం ఉంది. అది ఏ కేంద్రం అంటే అక్కడ పెంపుడు జంతువులను అమ్ముతారు. పిల్లి, కుక్క, చిలుకలు వంటి కొన్ని రకాల పక్షులను సైతం అక్కడ అమ్ముతుంటారు.

ఆ కేంద్రంలో కుక్కపిల్లలను అమ్మే చోట ఓ చిన్న కుర్రాడు నిల్చున్నాడు. అక్కడ కుక్కపిల్లలను అమ్మే వ్యక్తికి ఓ కుక్కపిల్లను చూపించి "దాని ధర ఎంతని?" అడిగాడు.

"వెయ్యి రూపాయలన్నాడు" అతను.

"సరే, అయితే వద్దులే.." అంటూ మరొక కుక్కపిల్లను చూపించి దాని ధర అడిగాడు.

"అయిదు వందల రూపాయలన్నాడు" దుకాణదారు.

ఇంతకూ ఆ చిన్నోడి దగ్గరున్నవి యాభై రూపాయలు.

అందువల్ల తన దగ్గరున్న దానికంటె తక్కువ ధరకు కుక్కపిల్ల దొరుకుతుందేమోనని ఆలోచించాడు చిన్నోడు.

ఆ దుకాణంలో ఓ మూల ఎవరూ పట్టించుకోకుండా ఉన్న ఓ కుక్క పిల్ల కనిపించింది. అది కుక్ కుచ్ అని చిన్నగా మూలుగుతోంది.

దాన్ని చూసిన చిన్నోడు "అదెంత?" అని అడిగాడు.

అప్పుడు దుకాణదారు "దానికో కాలు లేదు. అందువల్ల అది నీతో ఆడుకోలేదు, దూకలేదు, వేగంగా పరుగెత్తలేదు" అన్నాడు.

ఆ విషయం తెలిసే అడుగుతున్నానండీ" అన్నాడు చిన్నోడు. దాని ధర ఎంతో చెప్పండి అని అడిగాడు.

"తమ్ముడూ, దానికి కాలు లేదని చెప్తున్నాగా. దాన్ని డబ్బులు పెట్టి



కొంటారా ఎవరైనా. దానిని నీకు ఉచితంగానే ఇస్తున్నాను. నువ్వేమీ ఇవ్వక్కర్లేదు. తీసుకుపో" అన్నాడు దుకాణదారు.

ఆ మాటతో కుర్రాడికి కోపం వచ్చింది. "మీరేమీ ఉచితంగా ఇవ్వక్కర్లేదు. నా దగ్గర యాభై రూపాయలు ఉన్నాయి, ఈ యాభై తీసుకోండి" అని అతనికి ఇచ్చి "కుక్కపిల్లను ఇవ్వండి" అన్నాడు కుర్రాడు.

దుకాణదారుకి ఏమీ అర్థం కాలేదు. ఆశ్చర్యంగా చూశాడు.

"సరే" అంటూ కుర్రాడి దగ్గర యాభై రూపాయలు తీసుకుని కుక్కపిల్లను ఇచ్చాడు.

కుర్రాడు కుక్కపిల్లను రెండు చేతులతో అందుకుని గట్టిగా హత్తుకుని దుకాణంలోంచి బయటకు వచ్చాడు.

దుకాణదారు కుర్రాడి వంకే ఆశ్చర్యంగా చూసాడు. అప్పుడు అతనికి ఓ విషయం అర్థమైంది.

ఆ చిన్నోడు దాన్ని ఎత్తుకుని కుంటుకుంటూ నడుస్తున్నాడు. అవును.. ఆ కుర్రాడికి ఒక కాలు సరిగ్గా లేదు. అది వంకర.

ఈ కుక్కపిల్లను ఎవరూ కొనరని అనుకున్నాడు దుకాణదారు. లోపమున్న ఆ కుక్కపిల్లకు కూడా ఓ యజమాని దొరికాడు. అతనూ అవిటివాడే. అందువల్ల అంగవైకల్యం ఓ లోపం కాదన్న సంగతిని ఆ దుకాణదారు అర్థం చేసుకున్నాడు.

.............

నాకు తెలిసిన ఒక వ్యక్తి వున్నాడు.

అతను కాస్తంత పెద్దతనే. లేచి సరిగ్గా నడవలేడు. ఎప్పుడూ పడక్కుర్చీలోనే ఉంటాడు. అతను తనకు తోడుగా ఓ కుక్కను పక్కనే కూర్చోపెట్టుకునేవాడు.

అది కూడా వయస్సు మళ్లిన కుక్కే. అది లేవడానికే ఎంతో కష్టపడుతుంటుంది, ఎప్పుడూ ఆయన పడక్కుర్చీ పక్కనే ఉంటుంది.

ఆ పెద్దాయనను చూడటానికి ఓ రోజు ఒకరు వచ్చారు.

"మీరు.. మీకు తోడుగా ఓ యువకుడిని మీ దగ్గర పెట్టుకోవచ్చుగా. ఈ ముసలి కుక్కను మీకు తోడుగా పెట్టుకున్నారేంటి? అది లేవలేదు, మొరగలేదు. దానివల్ల మీకు లాభమేమిటీ? ఏదైనా ప్రమాదం జరిగితే ఇది మిమ్మల్ని కాపాడగలదా చెప్పండి!" అన్నాడు.

అప్పుడు ఆయన "నాకు ఏదన్నా ఆపద వస్తే ఈ కుక్క నన్ను ఒంటరిగా విడిచిపెట్టి పారిపోదు కదండీ. అందుకే దానిని నా దగ్గరే పెట్టుకున్నాను" అని అన్నాడు. ✦

# 'విశ్వంభర' మానవ మహాప్రస్థానం

జయసూర్య

**తెలుగు సాహిత్యంలో మేరు శిఖరం డా॥ సి.నారాయణ రెడ్డి అరుదైన అసమాన ప్రతిభా ముద్రతో, కవిత్వం శ్వాసగా పద్యకావ్యాలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్యకృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రాకథనాలు, సంగీత నృత్యరూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్రకథలు, గజళ్లు, వ్యాసాలు, విమర్శన గ్రంథాలు, అనువాదాలు ఎన్నో ప్రక్రియలలో సాహితీ వినీలాకాశంలో ధృవతారగా విలసిల్లుతున్న వైతాళికులు.**

సినారె కావ్యం 'విశ్వంభర', ఆ మహాకవిని జ్ఞానపీఠ ఉన్నత శిఖరంపై అధిష్టింపచేసింది. మానవ ఇతిహాస క్రమానుగత తాత్త్విక కావ్యం అది. విశ్వంభరకు ప్రస్తావనలో "ఈ కావ్యానికి నాయకుడు మానవుడు రంగస్థలం విశాల విశ్వంభర" నేపథ్యం ప్రకృతిగా అనాది నుంచి నేటి వరకు మానవ ప్రస్థానం" అన్నారు సినారె. 1980లో ప్రచురింపబడిన విశ్వంభర, విశ్వయవనికపై మానవ మనుగడ ప్రస్థానంగా ప్రపంచ సాహిత్యంలో అపురూపమైన చరిత్ర సృష్టించింది.

**"మనసుకు తొడుగు మనిషి**
**మనిషికి ఉడుపు జగతి**
**ఇదే విశ్వంభరా తత్త్వం**
**ఇదే అనంత జీవిత సత్యం"** అన్నారు ముగింపులో.

1931 జులై 29న కరీంనగర్ జిల్లా హనుమాజీ పేటలో జన్మించిన నారాయణరెడ్డి, 'నవ్వని పువ్వు' గేయనాటికలతో ఆరంభించి 2016లో 'నా రణం మరణం పైనే' చివరి కవితా సంపుటిగా 92 గ్రంథాలు వెలువరించిన సాహితీ తపస్విగా ప్రతిష్ఠత సాధించారు. 'ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు ప్రయోగాలు' సిద్ధాంత గ్రంథం డాక్టరేట్ యిచ్చింది. 1988లో జ్ఞానపీఠాధిష్టిత వరించింది. నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథ నాయుడు (గేయకావ్యాలు) విశ్వగీతి, జలపాతం, అజంతా సుందరి, స్వప్నభంగం, దివ్వెల మువ్వలు, రామప్ప, ఋతుచక్రం, అక్షరాల గవాక్షాలు, మంటలు–మానవుడు, మధ్య తరగతి మందహాసం ఎన్నో యితర వచన కవితా సంపుటాలు, విశిష్ట రచనలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. పోతన మహాకవి రచించిన భాగవత పద్య రత్నాలను 'మందార మకరందాలు'గా మధుర కవితా తత్త్వాన్ని సాక్షాత్కరింపచేసారు.



ఉర్దూ సాహిత్యంలో సుప్రసిద్ధ కవితా ప్రక్రియ 'గజల్', సినారె అద్భుత సృజనాత్మకతకు అద్దం పట్టింది. 1972లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'మంటలూ–మానవుడు' ఆధునిక మానవుని వేదన అక్షరీకరణ చేసింది. నాలుగు పాదాల రుబాయీల విస్తరణ 108 'ప్రపంచ పదులు' సమాహారమైన ముక్త కావ్యంగా ఎంతో విశిష్టత సాధించింది. 18 రకాల సాహితీ ప్రక్రియలలో మహాకవిగా సినారె శకం ఆవిర్భవించింది. 1967లో వెలువడిన సిద్ధాంత గ్రంథం నేటికీ తెలుగు భాష, సాహిత్య పరిశోధనా విద్యార్థులకు దిక్సూచిగా మార్గదర్శకం.

**"ఈ నల్లని రాలలో**
**ఏ కన్నులు దాగెనో**
**ఈ బండల మాటున**
**ఏ గుండెలు మ్రోగెనో"**

అంటూ సినారె, రామప్ప సంగీత రూపకానికి రచించిన పాట కాకతీయ శిల్పకళా వైభవాన్ని శిఖరాయమానం చేసింది. తరువాత అదే సినీ గేయంగా తెలుగు శ్రోతల హృదయాలను ఆకట్టుకుంటోంది. సినారె సినీ గీతాలకు సాహితీ విలువ ప్రసాదించారు. సామాన్య తెలుగు ప్రజానీకానికి సినారెను, పాట అత్యంత సన్నిహితుణ్ణి చేసింది. ఆయన కలం నుండి జాలువారిన పాటలు లలిత ప్రౌఢ లాలిత్యంతో, సాహితీ సౌరభాలు వెదజల్లుతూ ఆణిముత్యాలుగా శ్రోతలను అలరిస్తున్నాయి. సినారె తెలంగాణ పల్లె జీవనాన్ని 'ఋతుచక్రం' కావ్యంలో పల్లెపలుకుబళ్లకు పట్టం కట్టారు. పల్లెజీవనం, పల్లెపదాలు, పదబంధాలు, తెలంగాణ ప్రకృతి ఋతు సౌందర్యాన్ని కళ్లకు కట్టించారు. తెలంగాణ పలుకుబడిలో ఎన్నో వ్యాసాలు రాసిన సినారె పసుల పోశవ్వకు, పల్లెజీవనానికి బొమ్మ కట్టించి పల్లెకవిగా కావ్య పరిమళం గుబాళింపచేసారు.




ఆకాశవాణిలో ప్రసారమైన 'శ్రవ్య రూపకం' 'జాతికి ఊపిరి స్వాతంత్ర్యం' జాతీయ సాహితీ ఆదర్శమూర్తిగా దేశభక్తి ప్రబోధిస్తోంది. 'కాలం అంచు మీద'లో ధర్మాగ్రహంతో మాతృదేశాన్ని మూడోకన్ను తెరవమని పిలుపు యిస్తారు.

**"మారణ శక్తుల పాశవిక జ్వాలల్లో**
**మానవాంకురం మసికాకముందే"**

అంటూ దృక్పథం కవితా సంపుటిలో ప్రపంచాన్ని హెచ్చరిస్తారు.

**"కలిసి నడిచే కాలం"లో నేనింకా ధ్యానయోగిని కాలేదు/కవితా కర్మయోగిని'** అన్న సినారె..

**"చేలకు చేలు, పొలాలకు పొలాలు**
**బహుళ జాతి సంస్థల భారీ అరచేతుల్లో**
**ఉక్కు కట్టడాల కంకాళాలై శవతాండవం**
**చేస్తుంటే"** అంటూ జాతీయ కవిగా వ్యష్టి నుండి సమష్టి, సృష్టి, పరమేష్టి, విశ్వకవిగా సినారె కవితా ప్రస్థానం సాగిపోతుంది. **"రాస్తూనే వుంటాను మిత్రమా నా నిండు గుండె చివరి గంట మోగేదాకా"** కలసి నడిచే కలంతో కాలమై నడిచిన సినారె 'కలం అలిగింది'. 2017 జూన్ 17న ఆఖరి శ్వాస ఆగిన అనంతరం ఆవిష్కృతమైంది. ఆదిమానవుని నుంచి ఆధునిక మనిషి వరకు అనంత సృష్టి కాలచక్రంలో అసదృశ కవితాత్మ అద్భుత తాదాత్మ్యంతో జీవించిన డా॥ సినారె మహాకవిగా చిరంతన స్మరణీయులే.

# కుటుంబ కలహాలు తొలగేదెలా?


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




ఎమ్.సుధాకర్ – ఖమ్మం

ప్రశ్న: మా ఇల్లు మొదలు పెట్టేవరకు మాకు ఆర్థిక ఇబ్బందులు అసలు లేనేలేవు. అందరం సంతోషంతో వుండేవాళ్లం. కానీ మా ఇల్లు కట్టడం మొదలయిన తర్వాత మా కష్టాలు మొదలయ్యాయి. పస్తులు వుండే పరిస్థితి ఏర్పడింది. కుటుంబ కలహాలు కూడా మొదలయ్యాయి. దీనికి మూలం వాస్తుదోషం అని నా నమ్మకం.

జవాబు: మీరు ఇంటిని చక్కగా నైరుతి మూలకి కట్టుకుని మిగతా ముందు మూలంగా తెరిపి పెట్టారు. బావి ఉత్తరంలో వుంది. ఇంటి సింహ ద్వారానికి ఎదురుగా దక్షిణ రోడ్డుమీదకు గేటు తెరిచారు. చాలావరకు బాగానే వుంది. కానీ తూర్పున ఎక్కువ ఖాళీ స్థలం వుండటం వలన ఇంటి సింహ ద్వారానికి ఎదురుగా కాంపౌండు గోడకు తెరిచిన మెయిన్ గేటు మొత్తం దక్షిణం కొలతలో నీచ స్థానంలో అమరి వుండటం మీరు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులకు చాలావరకు కారణం అవుతుంది. ఆ గేటు అలాగే వుంచి మరో గేటు ఆగ్నేయ మూలకు దగ్గరగా దక్షిణ ఆగ్నేయంలో తెరవండి. మీకు మంచి ఫలితాలు తప్పక కనిపిస్తాయి.

## గృహప్రవేశం వాయిదా?

బి.ప్రవీణ్ – కొత్తగూడెం

ప్రశ్న: మేం కొన్న స్థలంలో కొబ్బరిచెట్లు చాలా ఉన్నాయి. ఇల్లు నిర్మించడానికి అడ్డంగా వున్నందువల్ల వాటిని తీసేసాం. ఇల్లు కట్టుకోవచ్చు అనేసరికి మా నాన్నగారు పోయారు. తరువాత కొన్ని రోజులకు ఇల్లు కట్టడం మొదలు పెట్టాం. గృహ ప్రవేశం మళ్లీ మళ్లీ వాయిదా పడుతోంది. ఎందువల్ల?

జవాబు: నైరుతి భాగాన్ని ఖాళీగా పెట్టి యితర ఏ మూలయినా కప్పు వేస్తే యిలాంటి దుష్పరిణామాలు ఏర్పడతాయి. కొబ్బరిచెట్లు నరికించటానికి మీ నాన్నగారి మరణానికి ఏదో సంబంధం వుందని అపోహ పడవద్దు. మీరు కొన్న స్థలంలో తూర్పు, ఉత్తర, ఈశాన్య, ఆగ్నేయ స్థలాలలో కొబ్బరిచెట్లను నరికి నేలను చదును చేసి పశ్చిమ దక్షిణ, వాయవ్య, నైరుతి భాగాలలో వున్న చెట్లను నరకకుండా పెంచటం వలన మంచి ఫలితాలే వుంటాయి. గృహ ప్రవేశం కాస్త అటూ ఇటూగా వాయిదాలు పడటం మామూలే.

## రీమోడల్ చేయవచ్చా?

సి.మంజునాథ్ – బెంగళూరు

ప్రశ్న: మాకు కాలనీలో ఇల్లు వచ్చింది. కార్మికులకు ఎవరి ఇల్లు వారికి కట్టి ఇచ్చారు. మా ఇంటిని రీమోడల్ చేయాలని అనుకుంటున్నాను. మేం పంపించిన ప్లాన్ చూసి మా ఇంటిని రీమోడల్ చేయవచ్చా? తెలుపగలరు.

జవాబు: మీరు రీమోడల్ చేస్తూ పెంచాలనుకున్న గది వలన మీకు ఈశాన్యం పూర్తిగా మూత పడుతుంది. ఆ గదిలో నుండి తూర్పు లేదా ఉత్తర ఈశాన్యంలో తలుపు తెరిచినట్లయితే ఆ దోషం ఉండదు.

## పడమరలో ఇలు కట్టవచ్చా?

ఎన్.వాసుకి – కొత్తకోట

ప్రశ్న: మా నాన్నగారు చాలా ఏళ్ల క్రితం మా ఇంటికి నైరుతిలో ఒక బావి తవ్వించారు. బావి తవ్వించిన మూడు నెలలకు నాకు తీవ్రమైన అనారోగ్యం కలిగింది. తరువాత నాన్నగారికి ప్రమాదం జరిగింది. ఆ విధంగా చెప్పశక్యంగాని కష్టాలు వచ్చాయి. తరువాత ఈశాన్యంలో ఒక గది నిర్మించాం. కొంత కాలం తరువాత నీటి ఎద్దడి మూలంగా ప్లానులో చూపించిన విధంగా ఉత్తరంలో బోర్ వేయించాం. మీరిచ్చే వాస్తు సలహాలు తెలుసుకుని మా ఇంట్లో కొన్ని మార్పులు చేసాను. దాంతో నా జీవితం మారి అభివృద్ధి కనిపించింది. ఈశాన్యంలో వున్న గది పడగొట్టించి నైరుతిలో వున్న నుయ్యి కప్పివేసాం. ఈశాన్యంలో బరువు లేకుండా చేసాం. పడమర భాగంలో బరువు లేనందువల్ల పడమర భాగం కనిపించకుండా మా కాంపౌండులో సరిహద్దు గోడ కట్టాం. పడమరలో బరువు లేనందువలన ఒక గృహం కడదామన్న ఆలోచన వుంది. అలా కట్టడం వల్ల ఆ పడమర భాగానికది ఈశాన్యమవుతుంది. అందువల్ల మొత్తం ఇంటికి అంతటికీ సెప్టిక్ ట్యాంక్ మార్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వాయవ్య దిశలో కడదామంటే అవతలవారి నూతి నీరు కలుషితమవుతుంది.

జవాబు: మెయిన్ గేటు దగ్గర ఉత్తరం గోడ నుండి దక్షిణం గోడ వరకు ఈశాన్యం నుండి ఆగ్నేయం మధ్యలో సెప్టిక్ ట్యాంకు కట్టవచ్చు. అలాగే ఉత్తరం కాంపౌండ్ గోడనానుకుని వున్న లెట్రిన్, బాత్‌రూంలు మీరు తీసేయాల్సి ఉంటుంది. ఇంటిని నైరుతి మూల వరకు పొడిగిస్తూ మరో రెండు గదులు కట్టుకోవడం మంచిది. ఇంటి వెడల్పు తూర్పు నుండి పడమర వరకు ఒకే విధంగా వుండాలి. మీరు తూర్పు వైపు రెండు గదులు విడిచిపెట్టి పశ్చిమాన ఒకే గదితో నిర్మాణం ఆపేశారు. అలా చేయడం మంచిది కాదు. ●

---

పశ్చిమానికి అధిపతి వరుణుడు. పశువులను వృద్ధి చేసే మహాత్మ్యం గల దిక్కు. పశుశాలలు, వాహనాలు మొదలైనవి ఈ దిక్కున శుభ ఫలితాలనిస్తాయి.

నైరుతి, దక్షిణ, పశ్చిమాలు బరువులను భరించగల దిక్కులు. ఆయా గోడలకు ఆనుకునే విధంగా ఎంతటి బరువులనయినా వేయవచ్చు.

ఆగ్నేయానికి అధిపతి అగ్ని. అన్నిటినీ తనలో జీర్ణం చేసుకునే మహత్తర శక్తి గలది. ఆ చోట అగ్నిని రగిల్చితే అనుకోని ఆనందకరమయిన సంఘటనలు జరుగుతాయి. ఆగ్నేయంలో అగ్నికి బదులు నీరు వుంటే అనుకోని దుఃఖాన్ని కలిగించే సంఘటనలు జరుగుతాయి. శక్తికి మించిన ఆర్థిక ఖర్చులు మీద పడతాయి. ఆగ్నేయంలో కాక పొయ్యి మరో చోట వుంటే అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువ.

ఉత్తరంలోగానీ, ఈశాన్యంలోగానీ పొయ్యి వుంటే ఇంటి యజమాని క్రమంగా బద్ధకస్తుడై నెమ్మది నెమ్మదిగా నిష్ప్రయోజకుడయ్యే అవకాశాలు అధికం.

# అమెరికాలో వింత స్మారక చిహ్నాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని

శిలలపై శిల్పాలు చెక్కిన ఎందరో మహానుభావులు ప్రపంచ వ్యాప్తంగా మనకు తారసపడుతుంటారు. కొన్ని శిల్పాలను శిల్పులు చెక్కగా, మరికొన్ని ప్రకృతిసిద్ధంగా ఏర్పడి నయనానందం చేస్తుంటాయి.

ఇటువంటివి మనకు అమెరికాలో కనిపిస్తాయి. మనుషులు చెక్కిన అమెరికా దేశాధ్యక్షుల తలల శిల్పాలతో విరాజిల్లుతున్న మౌంట్ రష్మోర్, అమెరికా ప్రభుత్వం తొలి జాతీయ స్మారక చిహ్నంగా భాసిల్లుతున్న డేవిల్స్ టవర్ గురించి తెలుసుకుంటే అనేక వింతైన విషయాలు ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి.



## మౌంట్ రష్మోర్

మౌంట్ రష్మోర్ అనేది అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని దక్షిణ డకోటాలోని కిస్టోన్ సమీపంలో గల నల్ల పర్వతం పేరు. దీనిని మౌంట్ రష్మోర్ నేషనల్ మెమోరియల్, ప్రెసిడెంట్ మౌంటెన్ అని కూడా పిలుస్తారు. ఈ పర్వతంలో అమెరికా స్వతంత్రం, సమగ్రత అభివృద్ధికి పాటుపడిన నలుగురు అమెరికా దేశానికి చెందిన ఒకప్పటి అధ్యక్షుల తలలను బొమ్మలుగా గ్రానైట్ రాయితో చెక్కారు. ఇక్కడ ఒక బ్రహ్మాండమైన గ్రానైట్ కొండను తొలిచి నలుగురు ప్రముఖ అమెరికన్ అధ్యక్షుల తలలు చెక్కారు. ఆ ఒక్కొక్క తల అరవై అడుగులు పొడవు ఉంటుంది. అవి పూర్తిగా మనిషి రూపంలో చెక్కితే ఒక్కొక్కటీ 450 అడుగుల ఎత్తయిన విగ్రహాలవుతాయి. అయితే నిధుల కొరత కారణంగా ఇక్కడ అంతటి మహా విగ్రహాల తలలు మాత్రమే చెక్కటం జరిగింది. 1923వ సంవత్సరంలో డోన్ రాబిన్సన్ అనే అరవై ఆరేళ్ల చరిత్రకారుడైన వృద్ధ నేతకు ఈ ఆలోచన వచ్చింది. గౌరవనీయుడైన ఆ పెద్దాయన 1901లో సౌత్ డకోటా రాష్ట్ర హిస్టారికల్ సొసైటీని స్థాపించి, విలువైన తన పరిశోధనల ద్వారా సౌత్ డకోటా రాష్ట్ర చరిత్రలో మరుగున పడిన పలు అంశాలను వెలుగులోకి తెచ్చాడు. సౌత్ డకోటా రాష్ట్రంలోని బ్లాక్ హిల్స్ ప్రాంతంలో ఏవైనా బృహత్తరమైన గ్రానైట్ విగ్రహాలు నెలకొల్పితే పర్యాటకులు పెరిగి, టూరిజం కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా మెరుగు పరచుకోవచ్చని ఆయన భావించారు. నాటి సౌత్ డకోటా రాష్ట్ర సెనేటర్ పీటర్ నార్బెక్ కూడా ఈ ప్రతిపాదనను గట్టిగా బలపరచాడు. నార్బెక్ ఆ రాష్ట్ర మాజీ గవర్నర్ కూడా కావటంతో ఈ ప్రతిపాదన త్వరగానే ఆమోదం పొంది ఖరారైంది. అప్పటికే గొప్ప చిత్రకారుడిగా, శిల్పిగా, ఉపన్యాసకునిగా, రచయితగా, ఇంజినీర్‌గా, వైమానిక పరిశోధకునిగా పేరు ప్రఖ్యాతులు పొందిన గుట్జాన్ బోర్గ్లమ్ అనే ఆయన్ని ప్రధాన రూపశిల్పిగా నియమించారు. హార్నే పర్వత శ్రేణిలోని మౌంట్ రష్మోర్ అనే ఏకశిలా పర్వతాన్ని ఇందుకోసం ఎంపిక చేశారు. ఇప్పుడు ఇది అమెరికా సంయుక్త రాష్ట్రాల ఒక స్మారక చిహ్నంగా మారింది.



అమెరికన్ జాతిపితగా ప్రసిద్ధి చెందిన తొలి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్, అమెరికా విస్తరణకు మూలపురుషుడు, స్వతంత్ర ప్రకటన పత్రం రూపొందించిన థామస్ జెఫర్సన్, పెద్ద ఎత్తున అటవీ సంపదను కాపాడి, అమెరికన్ శ్రామిక ప్రజల పరిరక్షకునిగా పేరొందిన థియోడార్ రూజ్వెల్ట్, అంతర్యుద్ధాన్ని నివారించి అమెరికా యూనియన్ పరిరక్షకునిగా ప్రసిద్ధి పొందిన అబ్రహాం లింకన్ మొదలైన నలుగురు అధ్యక్షుల తలలను ఈ ఏకశిలా పర్వతం పై భాగంలో చిత్రీకరించారు. మౌంట్ రష్మోర్ నిర్మాణ పనులు 1927 అక్టోబర్ 4న ప్రారంభించారు. రమారమి 14 సంవత్సరాల తరువాత 1941 అక్టోబర్ 31న పూర్తి చేసి జాతికి అంకితమిచ్చారు. ప్రముఖ డచ్, అమెరికన్ శిల్పి గుట్జాన్ బోర్గ్లమ్, అతని కుమారుడు లింకన్ బోర్గ్లమ్, మేజర్ జెస్సీ టకర్, మరో సహాయకుడు కర్నల్ షేడ్‌ల సహకారంతో చెక్కారు. ఈ ప్రతిపాదనకు అప్పటి అమెరికన్ అధ్యక్షుడి అనుమతి కూడా లభించింది.

గుట్జోన్ బోర్గ్లమ్ మార్చి 1941లో మరణించిన తర్వాత, అతని కుమారుడు లింకన్ బోర్గ్లమ్ నిర్మాణ ప్రాజెక్టుకు నాయకుడిగా బాధ్యతలు స్వీకరించాడు. ప్రతి ప్రెసిడెంట్‌ను తల నుండి నడుము వరకు చిత్రీకరించాలని తొలుత భావించారు. నిధుల కొరత కారణంగా నిర్మాణాన్ని తలల వరకు మాత్రమే శిల్పీకరించి 1941 అక్టోబర్ 31 ముగించి జాతికి అంకితం చేశారు.

ఈ స్మారక చిహ్నం 60 అడుగుల ఎత్తులో ఉంది. ప్రతి అధ్యక్షుడి తల ఆరు అంతస్తుల భవనం ఎత్తుతో సమానం. సముద్ర మట్టానికి 5,725 అడుగుల ఎత్తులో ఇది ఉంది. ఈ మొత్తం నిర్మాణం 1,278.45 ఎకరాల మేర విస్తరించి వుంది. తొలుత స్థానికంగా లభించే నీడిల్స్ అనే రాతితో ఈ శిల్పాలు చెక్కాలనుకున్నారు. కానీ శిల్పకళకు ఈ రాయి అనువుగా లేదని ప్రణాళికను మార్చారు. దాదాపు 400 మంది కార్మికులు చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా వీటి నిర్మాణం గావించారు. ఇంత కఠినమైన పని చేసినప్పటికీ ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే సిలికా ధూళిని పీల్చడం వల్ల కొందరు కార్మికులు ఊపిరితిత్తుల వ్యాధి సిలికోసిస్ బాధపడి మరణించారు. ప్రతి విగ్రహం ముక్కు 240 అడుగుల పొడవు ఉన్నందున అవి 2.4 మిలియన్ల సంవత్సరాల వరకు ఉంటాయని పరిశీలకుల అభిప్రాయం. మరో అంచనా ప్రకారం సుమారు అయిదు వందల వేల సంవత్సరాల తరువాత ఈ విగ్రహాలు తమ ముఖాల రూపాలను కోల్పోయే అవకాశం ఉంది. ఈ విగ్రహాలు చెక్కడానికి ముందు ఈ పర్వతానికి ఎటువంటి పేరు లేదు.


న్యూయార్క్‌కు చెందిన వ్యాపారవేత్త చార్లెస్ ఇ రష్మోర్ ఈ ప్రదేశాన్ని కనుగొని అమెరికా అధ్యక్షుల విగ్రహాలు చెక్కే ప్రాజెక్ట ప్రారంభిస్తున్నప్పుడు సైతం భారీ ఎత్తున విరాళం ఇచ్చాడు. అప్పటి నుండి ఈ నల్ల పర్వతాన్ని మౌంట్ రష్మోర్ అని పిలవడం ప్రారంభించారు.

అప్పట్లోనే ఈ ప్రాజెక్ట్ పని పూర్తి చేయడానికి పది లక్షల డాలర్లు ఖర్చయిందట. విగ్రహాలు చెక్కటంలో వచ్చిన వృథా గ్రానైట్ ముక్కలను అమ్మగా భారీ మొత్తంలో డాలర్ల వర్షం కురిసింది. ఈ నిర్మాణ స్థలం నుంచి తొలగించిన గ్రానైట్ రద్దు ఈజిప్టులోని సుప్రసిద్ధ స్పింక్స్ విగ్రహ తయారీకి పట్టిన గ్రానైట్‌కి రెట్టింపు ఉంటుందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇతరులు ఇచ్చిన విరాళాలు కాక ఈ స్మారకం తయారీకి అమెరికన్ ప్రభుత్వం సమకూర్చిన నిధులు ఎనిమిది లక్షల ముప్పై ఆరువేల డాలర్లట. కానీ సౌత్ డకోటా రాష్ట్రానికి ఈ స్మారక నిర్మాణం నాటి నుండి ఒక తరగని పెన్నిధి అయింది. ప్రతి సంవత్సరం ఇక్కడికొచ్చే పర్యాటకుల నుంచి భారీగా ఆదాయం లభిస్తోంది. ఇప్పటి వరకు కనీసం పది కోట్ల మంది ప్రజల ఈ జాతీయ స్మారక ప్రదేశాన్ని సందర్శించారని అంచనా. జూన్, జులై, ఆగస్టులలో పర్యాటకులు అధికంగా వస్తుంటారు. మ్యూజియం పై భాగంలో ఉన్న గ్రాండ్ యూ టెర్రస్ పై నుండి మౌంట్ రష్మోర్ వీక్షణం అద్భుతంగా ఉంటుంది. లింకన్ విగ్రహం తల వెనక భాగంలో 70 అడుగుల పొడవైన రహస్యమైన గది ఉంది. ఆ రహస్యమైన గదిని హాల్ ఆఫ్ రికార్డ్స్ అని పిలుస్తారు. ఏడాదికి రెండున్నర మిలియన్ల మంది పర్యాటకులు ఈ ప్రదేశాన్ని సందర్శిస్తారని అంచనా.




## డెవిల్స్ టవర్

దీన్ని దెయ్యపు శిఖరం అంటారు. ఇది అమెరికాలోని వయోమింగ్ రాష్ట్రంలో బెల్ ఫూర్ష్ నది సమీపంలో హ్యూలెట్ అనే పట్టణం పరిధిలో నెలకొని ఉంది. ఈ చిన్న పట్టణానికి హ్యూలెట్ అనే పేరు 1881లో మొదటగా అక్కడ స్థిరపడిన హ్యూలెట్ అనే దంపతుల కారణంగా వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టవర్‌ను 1875 నుండి డెవిల్స్ టవర్ అని పిలుస్తున్నారు. కర్నల్ రిచర్డ్ ఇర్వింగ్ డాడ్జ్ అనే జియాలజిస్ట్ ఈ నామకరణం చేశాడు. ఇంకా దీనికి అనేక పేర్లు ఉన్నాయి. ది బ్యాడ్ గాడ్స్ టవర్ పేరుతో పాటు ఎలుగుబంటీలకు సంబంధించి అనేక కథలు ఇక్కడ ప్రచారంలో ఉండటం వల్ల బేర్ లాడ్జ్ అని కూడా పిలుస్తుంటారు. స్థానిక తెగలవారు దీని పేరు మార్చాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కియోవా తెగలోని కొందరు దీన్ని ట్రీ రాక్ అని, మరికొందరు ఘోస్ట్ మౌంటెన్ అని కూడా పిలుస్తున్నారు. సముద్ర మట్టం నుంచి దీని ఎత్తు 1,550 మీటర్లు. ఈ పర్వతం కింది భాగం చుట్టుకొలత సుమారుగా 1.6 కిలోమీటర్లు ఉంటుంది. విశిష్టమైన ఈ శిఖరం 5 నుంచి 6 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిందని భూగర్భ శాస్త్ర నిపుణులు తేల్చారు.



బెల్ ఫూష్ నదీ తీరానికి సమీపంలోని భూమిలోని మాగ్మా భూమి పొరలను చీల్చుకుని బయటికొచ్చి ఆ తరువాత చల్లబడటం కారణంగా ఈ డెవిల్స్ టవర్ ఏర్పడింది. 1906లో అమెరికన్ ప్రెసిడెంట్ థియోడోర్ రూజ్‌వెల్ట్ ఈ శిఖరం, దాని చుట్టూ ఉన్న సుమారు 1,374 ఎకరాల ప్రదేశాన్ని ఒక నేషనల్ మాన్యుమెంట్‌గా ప్రకటించి తగిన రక్షణ ఏర్పాట్లు చేశారు. అమెరికాలో ఉన్న 400కు పైబడిన జాతీయ పార్కులలో డెవిల్స్ టవర్ నేషనల్ పార్క్‌ది ఒక విశిష్ట స్థానం ఇక్కడ అమలౌతున్న కఠినమైన చట్టాల కారణంగా ఈ ప్రదేశ పరిరక్షణకు అనేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి ఇతర ప్రదేశాలవారు వచ్చి స్థలాలు ఆక్రమించి స్థిరపడటం వంటి వాటికి అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. అమెరికాలో తొలి జాతీయ స్మారక చిహ్నంగా ఈ దెయ్యపు శిఖరాన్ని ప్రకటించారు. ఈ పర్వత పాదం వద్ద ఎల్లప్పుడూ పరిశుభ్రమైన, చల్లటి నీరు లభిస్తూ ఉండటం కారణంగా ఈ ప్రదేశానికి పర్వతారోహకులు, పిక్నిక్ చేసుకునే సాధారణ ప్రజలు, దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి అసంఖ్యాంగా వస్తుంటారు. ఇక్కడికి సమీపంలోనే కొయ్య దుంగలతో నిర్మించిన విజిటర్ సెంటర్ ఉంది. అక్కడ ఒక పుస్తక విక్రయ కేంద్రం కూడా ఉంది. ఫారెస్ట్ రేంజర్లకు ఆఫీస్ భవనాలు మాత్రమే కాక, క్యాంపులు వేసుకునే యాత్రికులు, పిక్నిక్‌కి వచ్చే పర్యాటకులకు కూడా ఇక్కడ తగిన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

దీని చుట్టూ అడవులు ఉన్నాయి. ఈ అడవులు ఎలా ఏర్పడ్డాయనేది 1800 సంవత్సరాలుగా భూ విజ్ఞాన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నప్పటికీ నేటికీ అసలు కారణం తెలలేదు. అమెరికా ప్రభుత్వం 1906లో దీన్ని జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించింది. అక్కడ ప్రకటించిన తొలి జాతీయ చిహ్నం ఇదే. డెవిల్స్ టవర్ చూడటానికి ఒక పెద్ద బురుజులా కనిపిస్తుంది. పొడవైన పెన్సిల్ ఆకారపు రాళ్లతో నిర్మించినట్లు కనిపిస్తుంది. ఇది ఎవరైనా నిర్మించిన కట్టడమా?



ప్రకృతిలో ఏర్పడిన సహజ సుందర దృశ్య కావ్యమా? అనేది ఇప్పటికీ తేలలేదు. కొందరైతే యూఎఫ్‌వోల ల్యాండింగ్ కోసం ఏలియన్లు తయారు చేసుకున్న ల్యాండింగ్ స్పేస్ అని నమ్ముతారు. దీనికి ఎటువంటి ఆధారాలు లేవు. అయినప్పటికీ 1977లో 'క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్' పేరుతో నిర్మించిన ఒక ఆంగ్ల చిత్రంలో ఈ టవర్‌పై యూఎఫ్‌వో ల్యాండ్ అయినట్లు చూపించారు.

డెవిల్స్ టవర్ సముద్ర శిలలతో ఏర్పడి, ఆ రాళ్లు చాలా సంవత్సరాల పాటు సముద్రంలోనే మునిగి ఉన్నాయని, వాటిని సముద్రం నుండి తీసుకుని వచ్చి ఎవరో ఇక్కడ పేర్చి ఉంటారని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సుమారు 225 మిలియన్ సంవత్సరాల క్రితం అంటే ట్రయాసిక్ కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల పశ్చిమ ప్రాంతంలో ఎక్కువ భాగం సముద్రంలో మునిగి ఉండేదని దాని వల్లే ఇవి ఏర్పడ్డాయని కొందరి విశ్వాసం. ఇదే కనుక నిజమైతే ఆ ప్రాంతంలోని రాళ్లన్నీ ఇవే లక్షణాలతో ఉండాలి. కానీ అలా లేకపోవడంతో ఈ కథనాలను కొందరు విశ్వసించడం లేదు. ఇక్కడి అడవుల్లో లకోటా, కియోవా అనే రెండు గిరిజన తెగలు నివసిస్తున్నాయి. వారి కథనాల ప్రకారం డెవిల్స్ టవర్‌ను దేవతలు సృష్టించారని నమ్ముతారు. ఆ కారణంగా వారు దీన్ని అతిపవిత్రమైనదిగా భావిస్తారు. డెవిల్స్ టవర్‌ను తిలకించడానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడకు రావడం ఒక ప్రత్యేకత అయితే, రాక్ క్లైంబింగ్ చేయడానికి అనేకమంది యువత రావడం మరో విశేషం.

ఒకప్పుడు ఇక్కడ పశువులను మేపేవారు చెక్క నిచ్చెనలు తయారు చేసి, రాళ్ల పగుళ్ల సాయంతో దీన్ని అధిరోహించేవారు. ఇప్పుడు క్లైంబింగ్ చేసేవారు తమ వద్ద ఉన్న అధునాతన సౌకర్యాలతో దీన్ని ఎక్కుతున్నారు. ఒక ఏడాదిలో దాదాపు ఆరు వేల మంది దీన్ని ఎక్కుతుంటారు. జూన్ మాసంలో స్థానికులు ఉత్సవం చేసుకోవడం వల్ల దీన్ని ఎక్కడానికి అనుమతి లభించదు.

## ఎవరో వస్తారని....

**(21వ పేజీ తరువాయి...)**

ఊరికోసం ఏదైనా చేద్దామనుకున్నాను. అందుకే ఎవరిపైనా ఆధారపడకుండా మేం నాలుగేళ్ల నుంచి కూలిపనులు చేస్తూ, రూపాయి, రూపాయి పోగు చేసిన డబ్బు రెండు లక్షలతో కొండ పైకి రహదారి నిర్మించుకున్నాం. ఆ డబ్బుతో నేను పక్కా ఇల్లు కట్టుకోవాలనుకున్నాను. కానీ నా సొంత ఇంటికంటే రోడ్డే ముఖ్యమని భావించాను" అని చెప్పేసరికి ఆమె ఔన్నత్యానికి, గొప్పతనానికి సభ చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

ఆ సభలో చదువుకున్నవాళ్లు, సంస్కారవంతులు ఎంతో మంది ఉన్నారు. కానీ వారికీ జాజికీ ఒక్కటే తేడా. అదే త్యాగనిరతి! ఈ రోజుల్లో రూపాయి ఖర్చు చేయాలంటే వంద సార్లు ఆలోచిస్తారు ఎంతో మంది. తనకేమీ లేకపోయినా, నిస్వార్థంగా పది మందికి సాయపడాలనే గొప్ప మనసున్న జాజి లాంటి ఆణిముత్యాలు మొత్తం జాతికే ఆదర్శంగా నిలుస్తారు. ఆమెకు వినమ్రతతో రెండు చేతులు ఎత్తి, గౌరవపూర్వకంగా దండం పెట్టకుండా ఉండలేకపోయారు అక్కడున్న వారందరూ. సరిగ్గా అప్పుడే ఎక్కడి నుంచో మైక్ లోంచి శ్రీశ్రీ గారి పాట శ్రావ్యంగా వినిపిస్తోంది.. "ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా.." అని.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలను శ్రద్ధగా నిర్వహిస్తారు. దూర ప్రాంత ప్రయాణాలు, అకాల భోజనం చికాకు కలిగిస్తాయి. వ్యాపారంలో స్తబ్దత ఏర్పడతుంది. మీ ప్రమేయం లేకుండానే మిమ్మల్ని వివాదాలలోకి లాగబడే ప్రయత్నాలు సాగుతాయి. విలువైన పత్రాలు, స్వర్ణాభరణాల పట్ల జాగ్రత్తలు పాటించండి.

## వృషభం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రయాసతోగానీ నులు సానుకూలపడవు. ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ సర్దుబాట్లను చేయగలుగుతారు. వస్త్ర వ్యాపారులు జాగ్రత్తగా మెలగాలి. ప్రింటింగ్, స్టేషనరీ వ్యాపారులకు అనుకూలం. సెంటిమెంట్ వస్తువుల పట్ల జాగ్రత్త పాటించండి. భూమికి సంబంధించిన క్రయ-విక్రయాలు యథాతథం.

## మిథునం



గ్రహస్థితి అనుకూలం. మీ ప్రణాళికలు, ఆలోచనలు నిర్దిష్టమైన రూపం సంతరించుకుంటాయి. కుటుంబ సుఖ సంతోషాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా పురోభివృద్ధి సాధిస్తారు. ఆదాయ పరిధిని విస్తృత పరచుకుని సంపదను పెంచుకోవాలనుకుంటారు. పనివత్తిడి, అధిక ప్రయాణాల వల్ల నిద్రాహారాలు సమయానుకూలంగా ఉండవు.

## కర్కాటం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆదాయాన్ని మించిన ఖర్చులు ఉంటాయి. కొత్త పెట్టుబడులను పెద్ద మొత్తాలలో పెడతారు. ఓ రకమైన ఆత్మన్యూనతా భావం కలిగి వుంటారు. నలుగురిలో ఉన్నప్పటికీ మిమ్మల్ని మీరు ఒంటరిగానే భావిస్తారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న అంశాలను అదృష్టానికి వదిలి వేస్తారు. శుభ వార్తలు వింటారు.

## సింహం



అనుకూలంగా వుంటుంది. వర్క్ డిస్ట్రిబ్యూషన్‌ను సక్రమంగా చేసుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల ప్రభావం ఆఫీసు మీద; ఆఫీసులోని పనుల వత్తిడి ప్రభావం ఇంటి పనుల మీద పడకుండా చూసుకుంటారు. అరమరికలు లేకుండా ఎదుటివారితో మీ మనోభావాలను పంచుకుంటారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు మనస్సుని ఆకట్టుకుంటాయి.

## కన్య



అనుకూలంగా ఉంటుంది. మీ పనితీరు మెరుగ్గా ఉంటుంది. సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. గుప్తదానాలు చేస్తారు. రహస్య చర్చలు సాగిస్తారు. ముఖ్యమైన ఆర్థిక పత్రాలు సకాలంలో కనబడక తాత్కాలికంగా ఇబ్బంది పడతారు. మీకు మేలు చేకూర్చే అంశాలలో కొంత జాప్యం జరిగినప్పటికీ తుది ఫలితాలు మెరుగ్గా ఉంటాయి.

## తుల



మిశ్రమ ఫలితాలు ఉంటాయి. అనేకాంశాలు మీకు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆరోగ్య సమస్యలు, ఆలోచనలు అధికమవటం, వత్తిడి మొదలైన కారణాల వల్ల మానసిక సౌఖ్యం లోపిస్తుంది. ఆర్థిక లోటుపాట్లను తీర్చుకోవడానికి అధికంగా శ్రమించాల్సి వస్తుంది. రహస్య వ్యూహాలు అవలంబిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు. వాగ్వివాదం వల్ల కలిగే నష్టాలు తెలుసుకుంటారు.

## వృశ్చికం



సాధారణ ఫలితాలు పొందుతారు. మానసిక ప్రశాంతతను సాధించడానికి ఆధ్యాత్మిక కార్యక్రమాల పైన దృష్టి కేంద్రీకరిస్తారు. ఆర్థిక పరమైనటువంటి ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ దైవానుగ్రహం రక్షిస్తుంది. అర్థంలేని వివాదాలు కాలహరణానికి కారణమవుతాయి. చిన్న చిన్న వ్యవహారాలకు కూడా పరపతిని ఉపయోగించవలసి వస్తుంది. సాధ్యమైనంత వరకు ముఖ్యమైన వ్యవహారాలను వాయిదా వేసుకోవడం ఉత్తమం.

## ధనుస్సు



సానుకూలంగా ఉంటుంది. రాజకీయ నాయకులతో మిత్రత్వం ఏర్పడుతుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా సముచితమైన స్థానం సాధించడానికి విశేషమైన కృషి చేస్తారు. ఆర్థిక పరమైన అంశాల పైన దృష్టి సారిస్తారు. వ్యక్తిగత రహస్యాలను బహిర్గతం చేస్తున్న వ్యక్తులను కట్టుదిట్టంగా పట్టుకోగలుగుతారు. చిన్నపాటి గాయాలను గ్రహస్థితి సూచిస్తోంది. సంతానానికి ఉన్నత విద్యావకాశాలు కలిసి వస్తాయి.

## మకరం



మిశ్రమ ఫలితాలు పొందుతారు. కుటుంబ విషయాల పురోగతి కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. కొత్త రుణాలు చేస్తారు. పాత రుణాలను తీరుస్తారు. నూతన ఉద్యోగావకాశాలను అన్వేషించడంలో సఫలతను సాధిస్తారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తారు. కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచిస్తారు. శతృవర్గం పోటీ అధికమవుతుంది. తొందర పడకుండా నిదానంగా ఆలోచించి నిర్ణయాలను అమలు పరచండి.

## కుంభం



అనుకూల ఫలితాలు సాధిస్తారు. శక్తికి మించి శ్రమిస్తారు. క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తారు. ఆర్థిక పరమైన అంశాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఓ పొరపాటు సమాచారం విని అదే నిజమని భ్రమపడతారు. వ్యాపార వ్యవహారాలు సున్నితమైన అంశాలతో ముడిపడి ఉంటాయి. దూర ప్రాంత ప్రయాణాల తేదీలను ఖరారు చేసుకుంటారు.

## మీనం



గ్రహస్థితి అనుకూలంగా ఉంటుంది. మొండికి పడిన పనులను సాధించుకోగలుగుతారు. వృత్తి, ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన మార్పులేవీ ఉండవు. ఆర్థికంగా లాభ నష్టాలు రెండూ ఉండవు. మిత్రులతో కలిసి వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాజకీయ పరంగా చర్చలు సాగిస్తారు. తరతమ భేదం లేకుండా అందరినీ కలుపుకుని పని చేస్తారు. తద్వారా లాభపడతారు. బ్యాంకు రుణాలు చేతికి అందివస్తాయి.

సింగిల్ పేజీ కథ

# నిర్ణయం

**జి.మధుమురళి**

బైక్ వేగంగా నడుపుతున్నాడు సురేష్ ఉత్సాహంగా. వెనుక కూర్చున్నది సరిత. సురేశ్, సరిత ఇద్దరూ కాలేజీలో ప్రేమించుకున్నారు. ఇద్దరి చదువైపోయి, ఉద్యోగాలు వచ్చిన తరువాత వారి ప్రేమ కొనసాగుతూనే వుంది. ఇద్దరి ఇళ్లల్లో చూచాయగా తెలిసినా, కులం వేరైనా మంచి సంబంధం కావడంతో ఆలోచిస్తున్నారు.

"వేగం వద్దు, మెల్లిగా పోనియ్యి" అన్నది సరిత, సురేశ్‌తో. మనం బైక్ ఎక్కాక బైక్‌కి కూడా హుషారెక్కి వేగంగా పోతోంది" అన్నాడు నవ్వుతూ సురేశ్.

"రోడ్డంతా రద్దీగా వుంది, జాగ్రత్త" అంటూ మళ్ళీ హెచ్చరించింది సరిత. అలా మాట్లాడుకుంటూ సరదాగా వెళుతున్నారు.

వీరి జంటను చూసి విధికి కన్ను కుట్టిందేమో. ఒక మలుపులో కారు రూపంలో దూసుకు వచ్చింది. ఇద్దరూ గట్టిగా బ్రేకులు వేసినా ప్రమాదం తప్పలేదు. కారు గుద్దుకోవటం, సురేశ్ సరితలు ఎగిరి పడటం జరిగింది. చుట్టుపక్కలవారు వెంటనే అంబులెన్స్‌కి ఫోన్ చేసి హాస్పిటల్‌లో చేర్పించి, వారి సెల్‌ఫోన్ ఆధారంగా ఇద్దరి కుటుంబ సభ్యులకు తెలిపారు. అందరు హాస్పిటల్‌కు చేరుకున్నారు. జరిగిన సంఘటనలో ఎవరి తప్పూ లేదు కనుక ఎవరికీ ఏమీ కాదని ఒకరినొకరు ఓదార్చుకుంటూ డాక్టర్ కోసం చూస్తున్నారు. డాక్టర్ రాగానే అందరూ ఆయన చుట్టూ చేరారు. "ప్రమాదమేమీ లేదు కదా డాక్టర్‌గారూ" అని అడిగాడు సరిత తండ్రి కన్నీళ్లు తుడుచుకుంటూ.

"ఇద్దరికీ ప్రాణభయం లేదు. కానీ కొన్ని టెస్టులు చేసాం. రిపోర్ట్ వచ్చాక చెబుతానంటూ" రూమ్‌లోకి వెళ్లాడు డాక్టర్. రెండు గంటలు గడిచాక డాక్టర్ తల్లిదండ్రులిద్దరినీ రూంలోకి పిలిచి "అబ్బాయికి ఏ ప్రమాదం లేదు కానీ" అంటూ కాసేపు ఆగాడు. సరిత, సురేశ్ తల్లిదండ్రులిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని.. "కానీ ఏంటి డాక్టర్?" అన్నట్లు డాక్టర్ వైపు చూసారు.

"అమ్మాయి తలకు బలంగా దెబ్బ తగిలింది. నరాలు దెబ్బ తినడంతో కంటి చూపు పోయింది" అన్నాడు డాక్టర్. ఘొల్లుమని ఏడుస్తూ బయటకు వెళ్లాడు సరిత తండ్రి.

"చెప్పండి డాక్టర్.. ఎంత ఖర్చయినా పరవాలేదు. ఆ అమ్మాయి కంటిచూపు వచ్చే మార్గం చెప్పండి" అంటూ డాక్టర్ చేతులు పట్టుకుని అడిగాడు సురేశ్ తండ్రి.

"ఇప్పుడైతే చెప్పలేం. కొంత కాలం తరువాత ఎలా వుంటుందో



చెప్పగలం" అన్నాడు డాక్టర్. సురేశ్ తండ్రి కూడా బైటికి వచ్చాడు. అందరూ ఏడుస్తూ కనిపించారు. సరిత తండ్రి దగ్గరకు వెళ్లి ఓదార్పుగా భుజంపై చేయి వేసి, "బాధ పడకండి. అంతా విధిలీల. మనమిప్పుడు ఏం చేయలేం. మా అబ్బాయి వల్ల ఇలా జరిగినందుకు మమ్మల్ని క్షమించండి. మేమూ కుమిలిపోతూనే ఉన్నాం. అయినా ఆందోళన పడవలసిన పనిలేదు. కొంత కాలం తరువాత చూపు వచ్చే మార్గం ఉందట" అన్నాడు సురేశ్ తండ్రి.

"అయ్యో, అంతా మా ఖర్మ, మా అమ్మాయి తలరాత. ఇందులో మీ తప్పేమీ లేదండీ" అంటూ వెళ్లిపోయాడు సరిత తండ్రి.

వారం తరువాత డిశ్చార్జ్ చేసుకుని ఇంటికి తీసుకువెళ్లిపోయారు. ఒక నెల గడిచిన తరువాత అందరూ తేరుకున్నాక తల్లిదండ్రులను పిలిచి తన నిర్ణయాన్ని చెప్పాడు. ముందు వ్యతిరేకించినా ఆలోచించి తమ అంగీకారాన్ని తెలిపారు.

సురేశ్ సంతోషంగా సరిత వాళ్ల ఇంటికి వెళ్లాడు. నెల రోజులుగా రాని సురేశ్ వచ్చేసరికి సరిత తల్లిదండ్రులు ఆశ్చర్యపోతూ నిలబడిపోయారు.

"అంకుల్ సరిత ఎక్కడుంది?" అన్న ప్రశ్నకు తేరుకుని గదిలో అని చెప్పారు. సురేశ్ గదిలోకి వెళ్లేసరికి సరిత పడుకుని ఉంది 'సరూ' అని పిలుస్తూ పక్కన కూర్చున్నాడు. ఒక్క పిలుపుకే లేచి చేజారిన నిధి దొరికినట్లు సురేశ్ అంటూ గట్టిగా కౌగిలించుకుంది. ఆమె కన్నీటితో చొక్కా తడిచిపోయింది. అలా ఎంతసేపు వున్నారో తెలియదు. ముందుగా తేరుకున్న సురేశ్ లేచి సరిత చేయి పట్టుకుని హాల్లోకి తీసుకువచ్చి అక్కడి సోఫాలో కూర్చోబెట్టి తనూ పక్కన కూర్చున్నాడు. ఎదురుగా సోఫాలో సరిత తల్లిదండ్రులు కూర్చుని ఏం జరుగుతోందో అర్థం కానట్లుగా చూస్తూ కూర్చున్నారు. "అంకుల్! నేను సరితను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు సూటిగా.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు ఆ మాటకు ఇద్దరూ. "జాలి పడుతున్నావా బాబూ" అన్నాడు సరిత తండ్రి.

"లేదండి. సరితను నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను" సమాధానమిచ్చాడు.

"చూపులేని" సరిత తండ్రి మాట పూర్తి కానీయకుండానే "ఆగండంకుల్. ఇప్పుడు ఆ మాట అంటున్నారు. ఇదే పెళ్లి అయ్యాక జరిగితే వదిలేయమంటారా, నేను వదిలేస్తానా?" అన్నాడు రాజేశ్.

"అది కాదు బాబూ" సరిత తండ్రి మాట పూర్తి కాకుండానే "మీరేమీ సందేహించకండి. రేపు మా అమ్మ, నాన్న వస్తారు. ముహూర్తాలు పెట్టించడానికి" అన్నాడు రాజేశ్.


వెంటనే కన్నీళ్ల పర్యంతమవుతూ రాజేశ్ చేతులు పట్టుకున్నాడు సరిత తండ్రి.

"ఊరుకోండి అంకుల్. ఇది నా ప్రేమతో కూడిన నా బాధ్యత" అన్నాడు రాజేష్. సరిత ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ రాజేశ్‌ని కౌగిలించుకుంది. సరితకు ధైర్యం చెప్పి రాజేశ్ ఆనందంగా ఇంటి ముఖం పట్టాడు.

అందరూ తేలికైన హృదయాలతో, ఆనందంగా వెళుతున్న రాజేశ్‌ను చూస్తూ నిలుచున్నారు.

# పదరంగం-18

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. కుదరదంటే కుదరదు అనడానికి ఇలా అంటారు (4)
6. కష్టకాలంలో ఆదుకునేవాడు (6)
7. వెచ్చన, తాపం (3)
8. అటునించి వచ్చిన చప్పుడు (4)
9. ఇది చుట్టడమంటే మొదలు పెట్టడం (అపసవ్యంగా) (3)
11. ఒకే వంశపు దాయాది తిరగబడ్డాడు (2)
14. నోటిలో వచ్చేది.... కురుపు (2)
16. ఇది తీయడమంటే నష్టంతో పూర్తిగా ఆరిపోవడం (3)
17. ఒక మహావృక్షం (2)
19. నోటిలో ఊరే నీళ్లు (4)
22. మన కాదు (3)
23. బాధ్యత, చేయవలసిన పని (2)
24. సహాయ సహకారాలు (5)
26. అడ్డదిడ్డంగా వాదించడం (5)
27. జాలరులు, వేటగాళ్ల వద్ద ఉండే జాలం (2)

### నిలువు

1. పిలువబడ్డవారి కలయిక (4)
2. తెలిసీ తెలియని విషయ పరిజ్ఞానం (6)
3. భూమిలో పెరిగేది (2)
4. చీకటి (4)
5. చెదరిన ధనవంతుడు (4)
6. ఆ మధ్యనే క్రికెట్ ప్రపంచ కప్ సాధించిన దేశం (4)
10. రక్షణ (3)
12. ఛత్రం (3)
13. 'పైకి' రావడం (2)
15. పనీ పాటా లేకుండా తిరిగేవాడు (3)
18. చాలా ఎక్కువ (4)
20. ధాన్యాదులను శోధించే వంటింటి సాధనం (3)
21. రోగం (2)
23. వెల, ఖరీదు (3)
24. సౌందర్యం (2)
25. నలగ్గొట్టడం (2)

## పదరంగం-16కి జవాబులు పంపించినవారు

1. గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు-రాజంపేట; 2. వెలివెల శ్రీరామారావు-పెనమలూరు; 3. యం.రమణకుమారి-హైదరాబాద్

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ................................................


................................................


ఊరు : ................................................


## పదరంగం-16 జవాబులు



# ఈ వారం కా'ర్టూన్స్'


నీవు అలిగి బస్సు ఎక్కి పుట్టింటికి వెళ్ళడం..నేను లీటర్ పెట్రోల్ కొట్టించుని వచ్చి నిన్ను తీసుకు రావడం ఈ నెలలో 72వ సారి..
S-1
32 Kms
Zakir...


నీవు ఓటేసిన పార్టీలోనే ఉన్నాను..
ఇంకా పార్టీ మారలేదు.. సరేనా? వెళ్ళు!!
ఎమ్మెల్యే
Zakir...


అర్జంటు.. అలాగే బిర్రుగా నిలబడు బ్రో.. ఈ సిటీలో ఒక్క టాయిలెట్టూ కనిపించలేదు!!
Zakir...

ఫోటో ఫీచర్



ఆస్ట్రేలియాలోని ఈ రహదారిని గ్రేట్ ఓషన్ రోడ్డు అంటారు. సముద్రపు అంచున వుండే ఈ రోడ్డు సుమారు రెండు వందల యాభై కిలోమీటర్లు ఉంటుంది. టోర్క్వేరీ నుంచి అల్లాన్స్‌ఫోర్డ్ వరకు వుండే ఈ ప్రయాణంలో అందమైన సముద్రంతో పాటు జాతీయ పార్కులు, లైట్ హౌజ్‌లు మరిచిపోలేని జ్ఞాపకాలను మిగిలిస్తాయి.









